కాత్యాయనీ దేవి కరుణించమ్మా

దసర శరన్నవరాత్రి ఉత్సవాలలో నాలుగవ రోజైన గురువారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలులోని పలు దేవాలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ దేవాలయాలలో ఏర్పాటుచేసిన భక్తిభరిత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్థానిక కేశవస్వామిపేట లలితాశ్రమంలో అన్నపూర్ణాష్టకం గురించి ప్రముఖ ప్రవచకులు నెమ్మాని సీతారామమూర్తి చేసిన ఆధ్యాత్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా అలరించింది. అమలనాధుని వారి వీధి వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక భజన కార్యక్రమం, వాసవి కోలాట భజన మండలి మహిళలచే గుడి ఉత్సవం అత్యంత శోభాయమానంగా జరిగింది. త్రిపురాంతకంలోని ప్రసిద్ధ త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో గురువారం అమ్మవారు కూష్మాండదుర్గాదేవి అలంకారంలో శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

- ఒంగోలు కల్చరల్, ఆంధ్రజ్యోతి




ఒంగోలులోని గాయత్రీదేవి ఆలయంలో చిన్నారి నృత్యం



త్రిపురాంతకంలో కూష్మాండదుర్గాదేవిగా..



భువనేశ్వరీదేవి అలంకరణలో రాజేశ్వరీ అమ్మవారు



గంటాపాలెంలో కామాక్షిదేవి అలంకరణలో..



లక్ష్మీదేవి అలంకరణలో గోవిందమ్మ అమ్మవారు



లలితాతిపుర సుందరీదేవి అలంకరణలో వాసవీ మాత



కాత్యాయనీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీ అమ్మవారు



తాళ్లూరు వద్ద హైవే నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు

కలెక్టర్ విస్తృత పర్యటన

● కొత్తపట్నం, తాళ్లూరు, పీసీపల్లి మండలాల్లో పరిశీలనలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ రాజాబాబు గురువారం పర్యటించారు. ముందుగా కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామ పరిధిలో విమానాశ్రయానికి ప్రతిపాదించిన భూములను పరిశీలించారు. ఆ భూముల మ్యాపులను కూడా చూసి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన తాళ్లూరు వద్ద బెంగళూరు- మేదరమెట్ల ఎక్స్‌ప్రెస్ హైవే పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అక్కడి తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, నిర్మాణ కాంట్రాక్టు ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. అనంతరం పీసీపల్లి మండలం దివాకరపురం వద్ద నిర్మించనున్న సీబీజీ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో సమావేశమై నిర్మాణ పురోగతి, కేటాయించిన భూముల వివరాలను ప్లాంట్ స్టేట్ హెడ్ టి.బాబు కలెక్టర్‌కు వివరించారు.

తగ్గించాల్సిందే!



రైతుసదస్సులో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

పొగాకు సాగు నియంత్రణపై కసరత్తు

రానున్న సీజన్ పొగాకు పంట సాగు నియంత్రణ కోసం బోర్డు విస్తృత కసరత్తు చేస్తోంది. ఇందుకోసం బహుముఖ చర్యలను చేపడుతోంది. గతానికి భిన్నంగా నారుమళ్ల సాగు సమయం నుంచే తనిఖీలు చేయడం, గతం కన్నా పంట ఉత్పత్తి పరిమాణం తగ్గించడం, మూడేళ్లకు ఒకసారి బ్యారన్ లైసెన్సులు పునరుద్ధరించడం లాంటి వాటిపై అవగాహన కల్పించేందుకు, భవిష్యత్ మార్కెట్ ప్రతికూల పరిస్థితులు వివరించేందుకు రైతులతో అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రైతులకు అవగాహన సదస్సులు
నారుమళ్ల సాగు నుంచే తనిఖీలు
ప్రతి మూడేళ్లకు బ్యారన్ లైసెన్సులు పునరుద్ధరణ
బహుముఖ చర్యలు చేపట్టిన పొగాకు బోర్డు
అనుమతించిన మేర సాగుకు అధికారుల ఒత్తిడి

ఒంగోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పొగాకు పండే బ్రెజిల్, జింబాబ్వేలలో భారీగా ఉత్పత్తి తగ్గడంతో ఆ మేర మన దేశంలో పంటకు డిమాండ్ లభించింది. గత సీజన్ (2023-24)లో దక్షిణాదిలో సగటు ధర కిలో రూ.267కుపైగా లభించింది. గరిష్ట ధరలు ఏకంగా రూ.380కి చేరగా సాధారణంగా రూ.50కి కొనే నాసిరకంలో గ్రేడ్ సైతం రూ.200 పలికింది. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్(2024-25)పై పడింది. రాష్ట్రంలో 167 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతిస్తే ఏకంగా 240 మిలియన్ కిలోల పంట పండించారు. అందులో దక్షిణదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో 105 మిలియన్ల పంట ఉత్పత్తికి అనుమతిస్తే దాదాపు 160 మిలియన్ల ఉత్పత్తి అంచనా. మార్చి 10న కొనుగోళ్లు ప్రారంభిస్తే ఇప్పటివరకు సుమారు 110 మిలియన్లు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలో రూ.232 మేర ఉంది. అంటే వేలం ప్రారంభించి ఆరున్నర మాసాలు అయినా ఇంకా దాదాపు 50 మిలియన్లు మేర రైతుల వద్దనే ఉంది. వచ్చే సీజన్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు పొగాకు బోర్డు పనివిధానంపైనా వత్తిడి పడుతుంది. రానున్న సీజన్‌లో పంట ఉత్పత్తి తగ్గింపు అందుకు సాగు నియంత్రణ ప్రధాన కర్తవ్యంగా గుర్తించి మూడు మాసాల క్రితం నుంచే అధికారులు అవసరమైన చర్యలు ప్రారంభించారు. ఉత్పత్తి పెంపులో పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి కన్నా అధిక సాగు, అధికంగా పండిన పంటలో కొంత వేలంకేంద్రాల వెలుపల అమ్మకం వంటి చర్యలు గుర్తించారు. ఈ నేపథ్యంలో రానున్న ఏడాది సాగు నియంత్రణ కోసం పొగాకు బోర్డు బహుముఖ చర్యలు ప్రారంభించింది.

నారుమడుల తనిఖీలు

గత రెండేళ్ల అధిక పంట ఉత్పత్తిపై ఎత్తేసిన పెనాల్టీలను తిరిగి విధించారు. అధిక పంటపై 3 నుంచి 6శాతం వసూలు చేస్తున్నారు. దీని ద్వారా వచ్చే సీజన్‌లో పెనాల్టీలు తప్పవన్న సంకేతాలు ఇచ్చారు. ఇక పక్షం రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వేలం కేంద్రాల అధికారులు తమ పరిధిలో నారుమడులను తనిఖీలు చేస్తున్నారు. రానున్న సీజన్ నుంచి మూడేళ్లపాటు లైసెన్సుల పునరుద్ధరణ నిబంధన పెట్టారు. చర్యలపై పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు స్పందిస్తూ పొగాకు సాగును తగ్గించడం అనివార్యంగా రైతులు పాటించాలని తద్వారా మాత్రమే నష్టాల నుంచి బయటపడ తారన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పంట ఉత్పత్తి తగ్గిస్తారా? వ్యాపారులను బోర్డు అధికారులు ఎలా నియంత్రిస్తారు? వేచిచూడాల్సి ఉంది.

అనుమతించిన ఉత్పత్తి తగ్గింపు

రాష్ట్రంలో 2024-25 పంట కాలానికి 167 మిలియన్లు అందులో దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో 105 మిలియన్ల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 2025-26 పంటకాలానికి రాష్ట్రంలో పంట ఉత్పత్తిని 142 మిలియన్లకు దక్షిణాదిలో 90 మిలియన్లకు తగ్గించారు. ఇక గతం కన్నా ఎక్కువ మంది రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామ, క్లస్టర్ స్థాయిలో వేలం కేంద్రాల స్థాయిలో ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించిన మేర మాత్రమే పంట సాగు, ఉత్పత్తి పరిమితం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బోర్డు అధికారులతో పాటు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలను కూడా పిలిచి రైతులతో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. గురువారం ఒంగోలు-1 వేలం కేంద్రంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై సదస్సు నిర్వహించారు. పొగాకు బోర్డు ఆర్ఎం రామారావుతో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, దర్శి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఒంగోలులో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా మంగమూరు రోడ్‌లో తొలగించిన రావి (దేవుడుచెట్టు) మళ్లీ చిగురించింది.గత నెల 30వ తేదీ మంగమూరు రోడ్‌లోని గాయత్రీ అమ్మవారి గుడి సమీపంలోని ఉన్న రావిచెట్టును తొలగించి, గాంధీ పార్కులో తిరిగి నాటారు. ఆ సమయంలో స్థానికులు, వీహెచ్‌పీ ప్రతినిధులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన చెట్టును తొలగించడం అన్యాయం అంటూ నిరసించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక చొరవ చూపి, వేదపండితులతో శాంతి హోమాలు, పూజలు చేపట్టారు. నెలరోజులకే రావి చెట్టు తిరిగి చిగురించడంతో ఆ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

833 మందికి డీఎస్సీ నియామక ఉత్తర్వులు

● ఇరువురికి సీఎం చేతులమీదుగా ప్రదానం
● మరో 16 మందికి తర్వాత... ● వచ్చేనెల 3 నుంచి శిక్షణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులకు ఎంపికైన 833మంది అభ్యర్థులకు గురువారం అమరావతిలో నిర్వహించిన నియామక పత్రాల ప్రదాన సభలో ఉత్తర్వులు అందజేశారు. వీరిలో ఇరువురు మహిళా అభ్యర్థులకు మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. వివిధ కారణాలతో డీఎస్సీ నియామక పత్రాల జారీ సభకు హాజరుకాలేకపోయిన 16 మంది అభ్యర్థులకు తర్వాత జిల్లాలో అందజేస్తారు. డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్లకు వచ్చేనెల 3వతేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇస్తారు. అమరావతిలో కొత్త టీచర్లకు జారీచేసిన నియమకపు ఉత్తర్వులతోపాటు శిక్షణకు సంబంధించిన ఉత్తర్వుల కాపీని కూడా జత చేసి కవర్‌లో పెట్టి అభ్యర్థుల చేతుల్లో పెట్టారు. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీలో 849 మంది అభ్యర్థులు పోస్టులకు ఎంపికయ్యారు. వీరిలో 477 మంది పురుషులు కాగా 372 మంది మహిళలు ఉన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో 629 పోస్టులకు 623 మంది, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, చెంచు పాఠశాలల్లో 43కు 43మంది ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోస్టులకు 661 మంది ఎంపికయ్యారు. టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్, ఇతర రాష్ట్ర, జోనల్ స్థాయి పోస్టులకు 188 మంది ఎంపికయ్యారు. ఇలా జిల్లాలో 849 మంది కొత్త టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు.

12 మందికి మినహాయింపు

అమరావతిలో జరుగుతున్న డీఎస్సీ నియామక పత్రాల జారీ సభకు హాజరయ్యే విషయంలో 12మంది మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఇచ్చారు. అమరావతి సభకు హాజరయ్యేందుకు 372 మంది మహిళా అభ్యర్థులు బుధవారం ఒంగోలుకు చేరుకుని వారికి కేటాయించిన వసతికేంద్రాల్లో బస చేశారు. మహిళా అభ్యర్థులు బస చేసిన వసతి కేంద్రాలను జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో గర్భిణులు, చంటి బిడ్డలకు పాలిస్తున్న తల్లులను చూసి చలించారు. వారి విజ్ఞప్తి మేరకు వారు అమరావతి వెళ్లకుండా ఉండేందుకు మినహాయింపు ఇచ్చారు. తొమ్మిది మంది గర్భిణీలు, ఇద్దరు చంటి బిడ్డల తల్లులు, ఒక దివ్యాంగ అభ్యర్థి కలిపి 12మందికి జేసీ మినహాయింపు ఇచ్చారు. జిల్లాలో కొత్తగా ఎంపికైన 623 మంది టీచర్లకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. కనిగిరిలోని ఆల్ఫా అగ్రికల్చర్ కళాశాలలో ఈ శిక్షణ ఇస్తారు. శిక్షణ చివరి రోజు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారు.

29న కనిగిరిలో 'మీ కోసం'

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కా రవేదిక(మీకోసం) కార్యక్రమాన్ని మూడు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించేందుకు కలెక్టర్ రాజాబాబు నిర్ణయించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు కనిగిరి, మార్కాపురం డివిజన్లు సుదూర ప్రాంతంలో ఉండటంతో అక్కడి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు రావడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 29వ తేదీన కనిగిరి, వచ్చేనెల 6న మార్కాపురం, 13వతేదీన ఒంగోలు, 27వతేదీన కనిగిరి, నవంబరు 3న మార్కాపురం, నవంబరు 10న ఒంగోలు, నవంబరు 17న కనిగిరి, నవంబరు 24న మార్కాపురం డివిజన్ కేంద్రాల్లో మీ కోసం కార్యక్రమం నిర్వహించేందుకు కలెక్టర్ రాజాబాబు షెడ్యూల్ రూపొందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

బైకు దొంగలు దొరికారు

● నిందితుల్లో ఒకరు బాలుడు ● అదుపులోకి తీసుకున్న పోలీసులు
● 19 మోటార్ సైకిళ్లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ

7

త్వరలో కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ

● ఏపీ ప్రణాళికాశాఖ డైరెక్టర్, కార్యాలయ అధికారి రస్నకుమారి

7

13 సొసైటీల ఆడిట్ పూర్తి

7

అడవిలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలి

సిబ్బందికి డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ ఆదేశం

7

నీటికుంటలో పడి కవలలు మృతి

● దర్శి మండలం లంకోజనపల్లిలో ఘటన

వివరాలు మెయిన్‌లో



చీపురు పట్టి రోడ్లు శుభ్రం చేస్తున్న ఎంఎల్‌ఏ బీఎన్ విజయ్‌కుమార్, డీపీవో వెంకటేశ్వరరావు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● స్వచ్ఛతాహీలో చీపురు పట్టిన ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎంఎల్‌ఏ బీఎన్ విజయ్‌కుమార్ సూచించారు..స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల సందర్భంగా బి.నిడమానూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఏక్ దిన్,ఏక్ గంట ఏక్ సాత్‌శ్రమదాన్ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్‌ఏ బీఎన్ విజయ్ కుమార్ పాల్గొని చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు.తడి, పొడి చెత్త డబ్బాలను మహిళలకు అందజేశారు.1000 మందికి మొక్కలను అందజేశారు.పారిశుధ్య కార్మికులకు శాలువా కప్పి సన్మానించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అధికారులు,ప్రజాప్రతినిధులతో కలసి స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీపీవో ఎం.వెంకటేశ్వరరావు,జడ్పీ సీఈవో చిరంజీవి, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, ఏపీవో రవిబాబు, ఏపీఎం బత్తుల నరేంద్ర, టీడీపీ నాయకులు గుమ్మడి సాయిబాబు, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, అంకిరెడ్డి,దివి పున్నారావు, కనగాల శ్రీనివాసరావు, సర్పంచ్ వడ్డిముక్కల శ్రీను పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ జాలాది మణిబాబు

న్యూ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : న్యూ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. హైదరాబాదు ఆశ్రయం హ్యాండ్స్ ఆఫ్ హోమ్ సహకారంతో స్థానిక మామిడిపాలెం, విశ్వాస్ నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఐఎంఈ జనరల్ సెక్రటరీ డాక్టర్ జాలాది మణిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పేదల కోసం పనిచేస్తున్న న్యూ లైఫ్ ఫౌండేషన్, ఆశ్రయం హ్యాండ్స్ ఆఫ్ హప్ సేవలు అభినందనీయం అన్నారు. ప్రజలు ఉచిత సేవలను వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బిషప్ నతానియేలు కొడవటికంటి, ఫౌండేషన్ ఛైర్మన్ జంగా జయరాజ్, రెవరెండ్ వేణుకుమార్, రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, తిమోతి, సహజ, బ్రహ్మయ్య, సుధాకర్, పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు కళ్లజోడులను ఉచితంగా పంపిణీ చేశారు.

పెంచిన పని గంటలను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెంచిన పనిగంటలను, ఓటీ పెంపుదలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. మహిళలు రాత్రి పనిచేయాలనే చట్ట సవరణలను వెనక్కు తీసుకోవాలన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. ఈవిధానాలను మానుకోకపోతే తగిన మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బంకా సుబ్బారావు,ఆంజనేయులు, రూబేను, ఉబ్బా ఆదిలక్ష్మి ఉన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం విధించిన నిషేధంపై సూరారెడ్డిపాలెంలో రైతులకు ఏవో యుగంధర్‌రెడ్డి అవగాహన కలిగించారు. గ్రామంలో వ్యవసాయ సిబ్బంది కరపత్రాలతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మండలస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లో కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దార్, కన్వీనర్‌గా తాను, ఎస్సై, మెడికల్ ఆఫీసర్ సభ్యులుగా వ్యవహరిస్తామని, నల్లబర్లీ పొగాకు సాగు చేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని రైతులకు ఏవో సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు సహకరించి, నల్లబర్లీ సాగు చేయవద్దని ఏవో రైతులకు విజ్ఞప్తి చేశారు.



పి.గుడిపాడులో రైతులకు సమగ్ర యాజమాన్య పరిస్థితులపై శిక్షణ ఇస్తున్న ఉద్యాన అధికారులు

నిమ్మతోటల్లో యాజమాన్యంపై రైతులకు శిక్షణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిమ్మతోటల్లో గురువారం రైతులకు సమగ్ర యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఉద్యాన అధికారి సంధ్య మాట్లాడుతూ నిమ్మతోటలో వేర్లకు తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. డ్రిప్స్. స్ప్రింక్లర్లకు సంబంధించి సబ్సిడీ వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈ కేవీపీ రంగారావు తెలిపారు. సీతారామపురం ప్రాతంలో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకువిద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అదే విధంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కర్నూల్ రోడ్ శ్రీనగర్ కాలనీ, భారత్ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్వచ్ఛత కోసం ఓ గంట కేటాయిద్దాం

- కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రోగ్యం, సుందరమైన నగరం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ఓ గంట కేటాయించాలని నగర కమిషనర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం స్థానిక మామిడిపాలెంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద శ్రమదానం నిర్వహించారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఏక్ దిన్-ఏక్‌గంటా-ఏక్ సాథ్ నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం సాధ్యపడుతుందన్నారు అలాగే పిచ్చిమొక్కలు తొలగించి, అందమైన పూల మొక్కలు నాటడం ద్వారా నగరాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దవచ్చని తెలిపారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఇళ్లలో సేకరించిన చెత్తను రోడ్లపక్కన పడవేయకుండా, ప్రతి ఇంటికొచ్చే కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ చాలా ముఖ్యమైనదని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినా ప్రజల సహకారం కూడా కావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపుతో త్వరలోనే ఒంగోలు నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా మారుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పి.శ్రీహరి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్ వైజర్లు షేక్ బాబ్జి, ఎన్. పిచ్చయ్యతోపాటు సచివాలయ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది. యూబీఐ అధికారులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత

మానవతావాది దీనదయాళ్ ఉపాధ్యాయ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమైక్య భారతదేశం కోసం వ్యాసాలు, రచనల ద్వారా యువతను ఉత్తేజపర్చిన గొప్ప మానవతావాది పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ మానవతావాది అని అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలాకిషోర్ మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో ఒక మారుమూల గ్రామంలో జన్మించిన పండిట్ దీనదయాళ్ గొప్ప జాతీయవాది అని కొనియాడారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నరేంద్రమోదీ నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి. విజయారావు, శివాజీ, పీదామోదర్, శ్రీలక్ష్మి, వై. సత్యవతి, విజయలక్ష్మి, రమాదేవి, కాటా రాధాకృష్ణమూర్తి, కే సుధాకర్, తిరుమలరావు, రాజేష్‌వర్మ, మధు, సంజీవకుమార్, తానికొండ సురేష్, గుర్రం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల సభలో మాట్లాడుతున్న గోపీ శ్రీనివాస్

వికసిత్ భారత్ ట్రస్ట్ కార్యాలయంలో..

భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఒంగోలులోని డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ వికసిత్ భారత్ ట్రస్టు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీరాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజే పీ అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, శివాజీ, దుంపా కోటిరెడ్డి, గుర్రం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పంట మార్పిడిపై అవగాహన సదస్సు

సంతనూతలపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు-1, 2, వెల్లంపల్లిపొగాకు కేంద్రాల పరిధిలోని పొగాకు రైతులకు గురువారం ఎఫ్‌సీవీ పొగాకు పంటకు ప్రత్యామ్నాయం, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రీజినల్ మేనేజర్ ఎస్.రామారావు మాట్లాడుతూ వచ్చే ఏడాదికి ఎఫ్‌సీవీ పంట విస్తీర్ణం కొంతమేర తగ్గించుకుని, పంట మార్పిడిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేవీకే దరిశి వ్యవసాయశాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డిమాట్లాడుతూ ఎఫ్‌సీవీ పంటకు ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పత్తి, పెసర, శనగ, మొక్కజొన్న పంటలు, వాటి వాటి దిగుబడుల వివరాలను తెలియజేశారు. అదేవిధంగా సాగుచేసే విధానంలో ఉత్తమ యాజమాన్యపద్ధతులు, పంటలపై వచ్చు తెగుళ్లు, పురుగులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్‌లు మాట్లాడుతూ పొగాకు పంట విస్తీర్ణం తగ్గించుకుని ఇతర ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఆ తరువాత ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ఒంగోలు-1 వేలంకేంద్ర నిర్వహణాధికారి నివేష్‌కుమార్ పాండే మాట్లాడుతూ అధిక విస్తీర్ణంలో పొగాకు పంట సాగుచేయొద్దని బ్యారన్, పొలాల కౌలు ధరలు పెంచుకుని ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పొగాకు రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ రామారావు

ఒంగోలు ఏఎంసీ పాలకవర్గం నియామక ఉత్తర్వులు జారీ

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఛైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావు, వైస్ ఛైర్మన్‌గా చిట్టెం వెంకట దుర్గా ప్రసాద్ రావు, సభ్యులుగా ఉలిచి నందకుమార్‌రెడ్డి, సింగోతు కృష్ణ కుమారి, సూదనగుంట శ్రీనివాసరావు, గంగవరపు సందీప్, రేపూరి నాగమణి, యాదల కోటేశ్వరమ్మ, నుసుం ఆదిలక్ష్మి, నత్తల అనిత, బొద్దులూరి శోభ, ముత్యాల సుజాత, షేక్ అమురుల్లా, పప్పు శ్రీనివాసరావు, ఆకుతోట వెంకటేశ్వర్లు, కరవది పీఏసీఎస్ ఛైర్మన్, ఒంగోలు అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్, మునిసిపల్ కార్పొరేషన్ ఛైర్మన్, జిల్లా అగ్రిగ్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిశ్రమల్లో భద్రత కల్పించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలలో భద్రతతో పాటు పర్యావరణ సంబంధ నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం రాత్రి జిల్లా పరిశ్రమలకేంద్రం, ఫ్యాక్టరీలు, కార్మిక, ఏపీఐఐసీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వివిధ తరహా పరిశ్రమలు, వాటికి ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలు, అనుమతుల మంజూరు విధానం, భద్రతా ప్రమాణాలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించి దిశా నిర్దేశంచేశారు. అంతకు ముందు సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

తల్లి వదిలి వెళ్లిన బిడ్డ శిశుగృహకు..

ఒంగోలు నగరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాల మరుగుదొడ్డిలోని బకెట్‌లో తల్లివదిలి వెళ్లిన బిడ్డను ఐసీడీఎస్ అధికారులు ఒంగోలు రామ్‌నగర్‌లోని శిశుగృహకు తరలించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని మహిళ ప్రసవం కోసం ప్రయివేట్ వైద్యశాలకు వచ్చి మరుగుదొడ్డిలోనే ప్రసవించి మగ బిడ్డను అక్కడే వదిలేసి వెళ్లి పోయింది. దీన్నిగుర్తించిన ఆసుపత్రి సిబ్బంది ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. గిద్దలూరు ఐసీడీఎస్ అధికారులు శిశువుకు తగినవైద్యం అందించి గురువారం ఉదయం ఒంగోలులో స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పీడీ సువర్ణకు అప్పగించారు. శిశువు సంరక్షణకు స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు గృహలో చేర్పించారు.

ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

- ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో సరదాగా ఈతకోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్పీ హర్షవర్ధనరాజు హితవు పలికేరు. గురువారం ఎస్పీ మాట్లాడుతూ ఈత సరదా మృత్యు పరదా కాకూడదని అన్నారు. ఈత కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకొని తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చ వద్దని అన్నారు. పిల్లలు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు,వంకలు చెరువులు కుంటలు, కాలువలు పూర్తిగా నిండిపోయాయి అని గుర్తు చేశారు.నీటి మట్టం పెరగడం వలన వాగులు, వంకలలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పాడాయని చెప్పారు. ఈత సరదా కోసం ప్రాణాలు ఫణంగా పెట్టవద్దని హితవు పలికారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పలు సంస్థల్లో రెవెన్యూ, పౌరసరఫరాలు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ, అగ్నిమాపక శాఖ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ మార్కాపురంలో పెట్రోలు బంకును తనిఖీ చేయగా ఆయా శాఖల అధికారులు పలు ఏజెన్సీలను పరిశీలించారు.జిల్లా వ్యాప్తంగా పెట్రోలు బంకులు 34, గ్యాస్ ఏజెన్సీలు 12, రేషన్ షాపులు 49, ఎంఎల్ఎస్ పాయింట్లు ఆరు, రైస్‌మిల్లులు 10, బాణసంచా గోడౌన్లు 2, ఆర్వో పాంట్లు 13, ఆర్టీసీ బస్టాండులు మూడు, ఎరువుల దుకాణాలు రెండు, సినిమాథియేటర్లు ఆరు తనిఖీ చేశారు .

గ్రామాల్లో 'స్వచ్ఛతాహీ సేవ'

టంగుటూరు(కొండపి),సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం స్వచ్ఛతా హీ 'సేవ' కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని పారిశుధ్య కార్యక్రమాలు చేశారు. ఆలకూరపాడులో ఎంపీడీవో రామసుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచారు.

వేలం కేంద్రం రెండులో పొగాకు కొనుగోళ్లకు షెడ్యూల్

ఒంగోలు(రూరల్)సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో ఈనెల 27, 29 తేదీలలో వేలంకు రైతులు రోజూ బ్యారన్‌కు 5బేళ్లు మాత్రమే తీసుకు రావాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి గురువారం తెలిపారు. 27వతేదీన సర్వేరెడ్డిపాలెం,కె.మామిడిపాలెం, యరజర్ల, పోతవరం, వెంగముక్కపాలెం, చెరువుకొమ్ముపాలెం,29న సూరారెడ్డిపాలెం, ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు గ్రామాల రైతులు వేలంకు బేళ్లు తీసుకు రావాలని కోరారు. ప్రతిబేలు 150కేజీల లోపు ఉండాలని తెలిపారు.

విమానాశ్రయం భూముల పరిశీలన

కొత్తపట్నం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన భూములను గురువారం కలెక్టర్ రాజాబాబు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు. విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన భూముల్లో ప్రభుత్వ భూములు ఎన్ని వందల ఎకారాలు అందుబాటులో ఉన్నాయి. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్నం తహసీల్దారు శాంతి, రెవెన్యూ సిబ్బంది భూముల వివరాలను కలెక్టర్‌కు వివవరించారు. అనంతరం కలెక్టర్ అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణాన్ని కూడా పరిశీలించారు.

కాత్యాయనీదేవి అలంకరణలో చెట్టుమహాలక్ష్మమ్మ



కాత్యాయనిదేవి అలంకరణలో చెట్టుమహాలక్ష్మమ్మ అమ్మవారు

సింగరాయకొండ , సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్‌రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో దేవి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో నాల్గోవ రోజైన గురువారం అమ్మవారు కాత్యాయనీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని జాలమ్మతల్లి దేవస్థానం లో శరన్నవరాత్రులు సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జాతమ్మతల్లిని దర్శించుకున్నారు.

చెన్నకేశవ స్వామివారికి విశేష అలంకరణలు

ఒంగోలు(రూరల్):ఒంగోలు నగరం కొప్పోలు శ్రీ చెన్నకేశవ స్వామివారి దేవాలయంలో గురువారం దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి శ్రీకాత్యాయని అమ్మవారిగా అర్చకులు అలంకరించారు. చెన్నకేశవ స్వామివారికి విశేష అలంకరణతో భక్తులకు దర్శన బాగ్యంకల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవాలయ కమిటీవారు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు.

పేస్‌లో ఈసీఈ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వారంరోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ గురువారం ముగిసింది. అప్లికేషన్స్ ఆఫ్ ల్యాబ్‌వ్యూచర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కమ్యూనికేషన్‌పై శిక్షణ ఇచ్చారు. విజయవాడ నరేష్ టెక్నాలజీ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రతినిధి వి. నరేష్ శిక్షకులుగా, పీఎల్ సత్యనారాయణ, ఎం. దుర్గాకోమలి పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈ శిక్షణతో విద్యార్థులకు ఉద్యోగఅవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు వీరాంజనేయులు, సీవీ సుబ్బారావు, ఈసీఈ హెచ్‌వోడీ అప్పారావు తదితరులు ఉన్నారు.

డీఎస్సీ విజేతలకు నియామకపత్రాలు అందించిన బీఎన్



డీఎస్సీ నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

చీమకుర్తి,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):డీఎస్సీలో విజేతలుగా నిలిచి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన చీమకుర్తితో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలోని యు వతీ, యువకులకు గురువారం అమరావతిలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నియామకపత్రాలు అందజేశారు.చీమకుర్తి పట్టణానికి చెందిన కొత్త రమేష్,బి.రామలక్ష్మి,ఎస్ఎన్ పాడుకు చెందిన షేక్ ఆస్మాతో పాటు పలువురికి పత్రాలు అందచేసిన విజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

ఆంక్షలను ఎత్తివేయాలని నిరసన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్1బీ వీసాలపై అమెరికా పెట్టిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని పలువురు డిమాండ్‌చేశారు. భారత విద్యార్థి సమాఖ్య, ప్రజాతంత్ర యువజన సమాఖ్య నగర కమిటీల ఆధ్వర్యంలో గురువారం స్థానిక రంగరాయుడు చెరువు కట్ట వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నగర నాయకుడు రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కేఎఫ్‌బాబు, రాజశేఖర్, సుబ్బారావు, కిరణ్, సురేష్ తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌లు, సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు పంచాయతీలకు సొంతంగా ఏవిధంగా ఆదాయం తీసుకురావాలనే దానిపై శుక్ర, శనివారం రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ గురువారం ఓప్రకటనలో తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన పీడీసీసీబీ ఛైర్మన్ సీతారామయ్య



కలెక్టర్ రాజాబాబుకు పూలమొక్క అందిస్తున్న పీడీసీసీబీ ఛైర్మన్ సీతారామయ్య

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పీ రాజాబాబును పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి మొక్క ఇచ్చిఅభినందించారు. అనంతరం బ్యాంకుకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో డీవీ శర్మ ఉన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

కొండపి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చోడవరం సొసైటీ పరిధిలోని చోడవరం, గోగినేనివారిపాలెం, ముప్పవరం, కట్టుబడివారిపాలెం, మిట్టపాలెం, కె.ఉప్పలపాడు, వెన్నూరు గ్రామాల రైతులకు కావాల్సిన ఎరువులను గురువారం వ్యవసాయాధికారి మాల్యాద్రి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ బొద్దులూరి లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు ఎరువులను సహకార సంఘం ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. త్రీమెన్ కమిటీ సభ్యులు రావి నారాయణ, కమ్మ వెంకటేశ్వర్లు, చోడవరం గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు, దెబ్బతిన్న ఆటో

కంభం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బేస్తవార పేట నుంచి రాచర్ల వెళ్తున్న ఆటో కంభం మండలం చిన్నకంభం కాలనీ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల మేరకు.. ఆటోడ్రైవర్ గురుమూర్తి బేస్తవారపేట నుంచి రాచర్లకు 10మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆటో చిన్నకంభం మీదుగా వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కే మహాలక్ష్మి తలకు తీవ్ర గాయాలుకాగా, పీరాంబీ అనే మహిళకు ఎడమకాలు, కుడి కన్ను వద్ద గాయమైంది. ఆకుల నారాయణమ్మ, అంజమ్మకు తలలకు గాయాలయ్యాయి. రావిపాటి ఖాశింబీకి వీపు వెనుక గాయాలు కాగా డ్రైవర్ గురుమూర్తికి కుడి కన్ను, వీపు పక్కటెముకలకు గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వారిని 108లో తీసుకువెళ్లి కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెట్రోలు బంక్‌లు, సినిమా థియేటర్లలో తనిఖీలు



గ్యాస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో గురువారం గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోలు బంకులు, రేషన్‌షాపులు, సినిమా థియేటర్లను విస్తృతంగా తనిఖీ చేశారు. ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదనరావు, ఫుడ్ సెఫ్టీ అధికారి ఎండీ షమీర్‌ఖాన్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఎఫ్ఐ రామకృష్ణ పాల్గొన్నారు. గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్లను తూకం వేసి పరిశీలించారు. ఇలా ఆయా సంస్థలను పరిశీలించి లోపాలను గుర్తించారు. ఆ నివేదికలను జిల్లా ఉన్నతాధికారులు పంపనున్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులు వచ్చేనెల 7వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివరాం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 10 తరగతులు చదువుతున్న వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా వీరికి 9, 11 తరగతుల్లో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయ కార్యాలయం నుంచి పొందవచ్చని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య రంగంలో ఫార్మసిస్టులది కీలకమైన పాత్ర

ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే



మాట్లాడుతున్న ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్యునికి, రోగికి మధ్య వారధులుగా కీలకపాత్ర పోషించేది ఫార్మసిస్టులేనని, వైద్య రంగంలో ఫార్మసిస్టులది కీలకమైన పాత్ర అని ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కే శరత్‌బాబు చెప్పారు. వరల్డ్ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకల ర్యాలీని జిల్లా వైద్య శాఖా అధికారి వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కొవిడ్ వంటి విపత్కర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులతోపాటు, ఫార్మసిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రత్నాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ కాలక్రమంలో ఔషధ ఉత్పత్తి రంగం ప్రత్యేకంగా అభివృద్ధి చెందిందన్నారు. క్విస్ కాలేజి ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి రోగానికైనా ఫార్మసిస్టులు మందును కొనుగొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.రవికిరణ్, బీపీ కేఆర్ కరస్పాండెంట్ విజయలక్ష్మి, ఎన్జీవో సంఘం నగర అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు



కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలించిన డీఆర్వో ఓబులేశ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖలకు సంబంధించి సేవలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్)లో శాశ్వత ప్రాతిపదికన కమాండ్ కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు. కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశాలతో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేష కలెక్టరేట్‌లోని ఒక గదిలో కమాండ్ కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు. ఈ కంట్రోలు రూము ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఓబులేషు, కలెక్టరేట్ ఏవో రవి, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దోర్నాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శ్యామ్ ప్రసన్నతాంజలి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మౌర్యచంద్రసిద్ధార్థ, మాటామహేష్‌బాబు, కోడి రాహుల్, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థాయిలో రాణించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరచాలని ఉపాధ్యాయ సిబ్బంది ఆకాంక్షించారు.

మోటార్ బైక్ దొంగలు దొరికారు

నిందితుల్లో ఒకరు బాలుడు
అదుపులోకి తీసుకున్న పోలీసులు
19 మోటార్ సైకిళ్లు స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఇద్దరు నిందితులతోపాటు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని 19 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఆ కేసు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం గురవాయపాలేనికి చెందిన తాళ్లూరి గాబ్రియల్, బండారు నవీన్‌తోపాటు మైనర్ బాలుడిని ఒంగోలు నగర శివారు ప్రాంతమైన నేతాజీనగర్ సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించారు. వారు దొంగిలించిన 19 మోటార్‌సైకిళ్లను స్వాధీనం(వాటివిలువ రూ.13,50,000) చేసుకున్నామన్నారు. తాళం వేయకుండా ఉన్న వాటిని లక్ష్యంగా చేసుకొని ఒంగోలు, టంగుటూరు ప్రాంతాలలో 19 మోటార్ సైకిళ్లను ముగ్గురు కలిసి దొంగిలించారని చెప్పారు. వీరిపై నరసరావుపేటలో కేసులు నమోదయ్యాయన్నారు. సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయడం అలావాటు పడ్డారని చెప్పారు.

● సిబ్బందికి ఎస్పీ అభినందనలు

మోటార్ బైక్ దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీఎస్ సీఐ జగదీష్, తాలుకా సీఐ టి.విజయకృష్ణ, ఎస్సైలు హరిబాబు, వి.వెంకటేశ్వర్లు, సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు ఖాజావలి, కానిస్టేబుల్ కే రవి, సీహెచ్ అంజిబాబు, పి.రఘులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారని డీఎస్పీ తెలిపారు.

● కేటీఎం డ్యూక్ బైక్‌పై చోరీలు

ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో కేటీఎం డ్యూక్ బైక్‌ను దొంగిలించిన దొంగలు ముగ్గురు అదే బైక్‌పై ఒంగోలు, టంగుటూరు, అద్దంకిలలో చోరీలకు పాల్పడ్డారు. సుమారు ఆరునెలలుగా వీరు ఒంగోలు పరిసర ప్రాంతాలలో 18 బైక్‌లు దొంగిలించిన మోటార్ సైకిల్‌పై వచ్చి చోరీలకు పాల్పడటం గమనార్హం.

ఇన్‌టెక్ పనులను పరిశీలించిన జేసీ



ఇన్‌టెక్ పనులను పరిశీలిస్తున్న జేసీ గోపాలక్రిష్ణ

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజక్టు గొట్టిపడియ గ్యాప్ వద్ద జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇన్‌టెక్ నిర్మాణ పనులను గురువారం జేసీ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గొట్టిపడియ గ్రామ రెవెన్యూ పరిధిలో కొండ ప్రాంతంలో ఉన్న సర్వే నెంబర్ 10లో 12.50 ఎకరాల ప్రభుత్వ భూమి రికార్డులు, క్షేత్ర స్థాయిలో భూమిని జేసీ పరిశీలించారు. రైల్వే స్టేషన్ రోడ్‌లో జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంకులో తనిఖీలు చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నిర్వాహకులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి పాల్గొన్నారు.

త్వరలో కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ

ఏపీ ప్రణాళికాశాఖ డైరెక్టర్ కార్యాలయ అధికారి రస్మికుమారి



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రతి ఇంటికీ కుటుంబ డిజిటల్ కార్డులు పంపణీ చేస్తామని ఏపీ ప్రణాళికాశాఖ డైరెక్టర్ కార్యాలయ అధికారి రస్మికుమారి చెప్పారు. మండలంలోని కరవది గ్రామ పంచాయతీలో గురువారం కుటుంబ డిజిటల్ కార్డులు పంపిణీపై గ్రామసచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్డులలో పేర్లలో తేడాలు ఉంటే మార్పులు చేర్పులు చేసుకునే సౌలభ్యం కల్పించారన్నారు. కుటుంబంలో కుమారుడు, కుమార్తెలకు వివాహమైతే వారికి ప్రత్యేక కార్డు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

డిజిటల్ హెల్త్ కార్డులతో మరింత ప్రయోజనం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ హెల్త్ కార్డులు వైద్య ఆరోగ్య సిబ్బందికి మాత్రమే కాకుండా పేషెంట్‌లకు మేలుచేస్తాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు చెప్పారు. ఆయుష్మాన్ భారత్, ఏబీడీఎం హెల్త్ రికార్డ్ ఈ హాస్పిటల్‌లో భాగంగా గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా పేషెంట్ ఎక్కడికైనా వెళ్లినా వైద్యం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అద్దెయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డిజిటల్ హెల్త్ కార్డులకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఇప్పటికే పలు విభాగాల్లో ఈ హాస్పిటల్స్ నమోదులో ముందున్నాయని, మిగిలి ఉన్న పేషెంట్‌ల వివరాలు నమోదుచేయాలని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల ఓపీ విభాగంలో ఏబీడీఎం ద్వారా రోగులు ఓపీ పొందుతున్నారన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి జీజీహెచ్‌కు ప్రోత్సాహకం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు తిరుపతిరెడ్డి, చెంచయ్య, రోల్ ఔట్ మేనేజర్ సాయి, హెచ్ఓడీలు ప్రభాకర్, సంధ్య, గోపికృష్ణ పలువురు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు కావలసిన స్థలాన్ని సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి, రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద యాచవరం గ్రామంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాల 2023లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని తెలిపారు. పాఠశాలలో 215 మంది విద్యార్థులకు నాలుగు గదులు మాత్రమే ఉండడంతో అదనపు తరగతి గదుల ఏర్పాటుకు సర్వే నెంబర్ 20-1సీ2లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తెలిపారు. భూమి రికార్డులు, విస్తీర్ణం, హద్దులను పరిశీలించి కలెక్టర్ రాజాబాబుకు నివేదికను పంపించనున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో, సర్వేయర్, సర్పంచ్ పాల్గొన్నారు.

కంభం చెరువు నీరు విడుదల

1800 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం
రైతుల అభ్యర్థనపై స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు



చిన్న కంభం కాలువ నుంచి పారుతున్న నీరు

కంభం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కంభం చెరువు నుంచి పొలాలకు నీటిని విడుదల చేశారు. మండలంలోని చిన్న కంభం, జేబీకృష్ణాపురం రైతుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కంభం చెరువు నుంచి గురువారం నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ చిన్న కంభం పరిధిలోని రైతులు సుమారు 1800 ఎకరాల్లో వరి పంటను సాగు చేయాలని భావించారు. ప్రస్తుతం చెరువులో 12 అడుగుల మేర నీరు చేరింది. దీంతో రైతులు పరిస్థితిని వివరించడంతో స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెంటనే నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆ మేరకు చిన్న కంభం ద్వారా నీటిని వదిలారు. దీంతో రైతులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞత తెలిపారు.

మైనింగ్ సీనరేజీ వసూళ్లపై క్వారీ యజమానులతో సమావేశం

క్రాక్‌లు ఉన్న రాయికి సీనరేజీ నుంచి మినహాయించాలని వినతి

బల్లికురవ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం మైనింగ్ సీనరేజీ వసూళ్ల కోసం ప్రైవేట్ కంపెనీ అయిన ఏఎంఆర్‌కు బాధ్యతలు అప్పగించింది. దీంతో మైనింగ్ సీనరేజీ వసూళ్లు ఎలా చేస్తారు అన్న దానిపై గురువారం స్థానిక వీర్లకొండ వద్ద ఉన్న వీటీసీ భవనంలో అన్ని క్వారీలకు చెందిన యజమానులతో విజిలెన్స్ మైనింగ్ ఏడీ రామచంద్రరావు అవగాహన సమావేశం నిర్వహించారు. ఒక్కో మీటరుకు ఎంత సీనరేజీ చెల్లించాలి అన్న దానిపై ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదికను యజమానులకు అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా ఏఎఆర్ కంపెనీ ప్రతినిధులు ప్రతి రాయికి సీనరేజీ చెల్లించాలని, అలా కాకుంటే కుదరదని చెప్పడంతో క్వారీ యజమానులు అలా ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. ఎక్స్‌పోర్టు వెళ్లే రాళ్లకు పూర్తి సీనరేజీ కడతామన్నారు. నాణ్యత తక్కువగా ఉండి సగం క్రాక్‌లు వచ్చిన రాళ్లకు చెల్లించలేమని చెప్పారు. నాణ్యతగా ఉన్న మీటర్లకే సీనరేజీ వసూళ్లు చేయాలన్నారు. అలా కుదరదని ప్రైవేట్ కంపెనీ నుంచి వచ్చిన ఒక వ్యక్తి చెప్పడంతో క్వారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలు కూడా బతకాలని ఇప్పటికే నష్టాలలో ఉన్నామని చెప్పారు. ఎలా పడితే అలా సీనరేజీ వసూళ్లు చేపడితే పరిశ్రమలు మూతపడక తప్పదన్నారు. మీరు చెప్పిన విధంగా సీనరేజీ వసూళ్లు చేస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలు కూడా మూతపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీ రామచంద్రరావు మాట్లాడుతూ మరో మారు సమావేశం ఏర్పాటు చేసి సీనరేజీ విధివిధానాలను వెల్లడించి పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా చేసే చర్యలు చేపడతామన్నారు. అందరూ మైనింగ్ సీనరేజ్ వసూళ్ల చెక్ పోస్టులకు సహకరించాలని కోరారు. సమావేశంలో కలర్ గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం అధ్యక్షుడు దూళిపాళ్ల శ్రీకాంత్, యజమానులు పత్తిపాటి సురేష్, గుంటక తిరుపతిరెడ్డి, మాలపాటి పోతురాజు, నాగేశ్వరబాబు, మైనింగ్ ఏజీ సురేష్‌రెడ్డి, ఆర్ఐలు రాజేంద్ర, ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్వరపీడితులను గుర్తించి వైద్య సేవలు అందించాలి




వీడియోకాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కుటుంబ, సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జ్వరం, మలేరియా, చికున్‌గున్యాగా నిర్ధరణ అయితే వారికి శాశ్వత చికిత్సను అందించడంతోపాటు వారి కుటుంబంలోని అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి రక్త నమూనాల లక్ష్యాలను కేటాయించి వైద్యాధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాల నిర్వహణపై రోజూ నివేదికలను జిల్లా వైద్యశాఖకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈకాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అడవిలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలి

సిబ్బందికి డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ ఆదేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీడీ అబ్దుల్ రవూఫ్, సిబ్బంది

మార్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అడవిలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని మార్కాపురం ప్రాజెక్టు టైగర్, డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ చెప్పారు. స్థానిక అటవీశాఖ డీడీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నంద్యాల ఫీల్డ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అటవీశాఖ సిబ్బంది ప్రతి ఒక్కరూ రోజూ దినచర్యలో భాగంగా బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి 5 కిలోమీటర్లు తక్కువ కాకుండా తిరగాలన్నారు. ఫుట్ పెట్రోలింగ్ మెరుగుపర్చుకుంటే నేరాల నియంత్రణ అదుపులో ఉంటుందని చెప్పారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా ఉంచి పర్యవేక్షించాలన్నారు. అనుమతి లేకుండా అడవిలో ఎవరు తిరిగినా, వేటాడే వలలు, ఉచ్చులు, కుక్కలు, బాణాలు, కంట్రీ మేడ్ గన్స్ కలిగి ఉన్న వాళ్లు కనిపిస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిరంతరం నాకాబందీ, పెట్రోలింగ్ నిర్వహిస్తూ వన్య ప్రాణులు, అడవుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. అడవులు అనుకుని ఉన్న తండాలు, గ్రామాల ప్రజలను, గిరిజనులను చైతన్యపరిచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో పిచ్చిరెడ్డి, డీఆర్‌వో నాగరాజుగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

13 సొసైటీల ఆడిట్ పూర్తి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 13 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో(సొసైటీ) ఆడిట్ పూర్తిచేసి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు జిల్లా సహకారాధికారి డి.శ్రీలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. మరో మూడు సొసైటీల్లో ఆడిట్ తుదిదశకు చేరుకుందన్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నత్తనడకన సొసైటీల ఆడిట్ వార్తకు డీసీవో వివరణ ఇచ్చారు. జిల్లాలో 93 సొసైటీల ఆడిట్ పూర్తికాగా మరో మూడు సొసైటీల్లో తుదిదశకు చేరుకుందన్నారు. మిగిలిన 77 సొసైటీల ఆడిట్ వివిధ దశల్లో ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి ఆడిట్ ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

ఎంపీడీవోగా అన్నమ్మ



తర్లుపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు ఎంపీడీవోగా ఒంగోలు అన్నమ్మ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటివరకు వెలిగండ్ల ఈవోపీఆర్‌డీగా పనిచేస్తు ఉదోన్నతిపై ఇక్కడ ఎంపీడీవోగా విధుల్లో చేరారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా అన్నమ్మ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దీన్ దయాళ్‌కు నివాళి

గిద్దలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, నాయకులు ఎ.ఉదయ్‌శంకర్, పిడతల రమేష్‌రెడ్డి, ముప్పూరి శ్రీనివాసులు, రాచర్ల కాసులు పాల్గొన్నారు.

కాత్యాయనీదేవీ కరుణించమ్మా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనం ఇచ్చారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ కూష్మాండ దుర్గగా దర్శనమివ్వగా ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాసవీ మాత అన్నపూర్ణాదేవిగా, జవహర్ నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.ఫొటో(25జిడిఎల్ 01): గిద్దలూరులో మీనాక్షిదేవి అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలకు కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు, సామూహికంగా



మార్కాపురంలో అన్నపూర్ణదేవిగా వాసవీమాత



కంభంలో గజలక్ష్మీదేవిగా కోట సత్యమాంబదేవి



రాచర్లలో కాత్యాయనీదేవిగా

నిర్వహించారు. వందలాది మంది ముత్తైదువులు కలిశాలు ఎత్తుకుని రాగా ఆ గంగాజలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారు వరాహవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కేఎస్‌పల్లి, ముండ్లపాడు, అమ్మవారి శాలల్లో నవరాత్రుల వేడుకలు వైభవంగా జరిగాయి.

కొమరోలు : వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిశాలలో గురువారం అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

రాచర్ల : పట్టాభి రామాలయంలో అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

కంభం : కోటా సత్యమాంబదేవి గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని 100, 200రూపాయల నోట్లతో అలంకరించారు. వాసవీమాత రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు.



పెట్రోల్ బంక్‌లో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్, తహసీల్దార్

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పెట్రోల్ బంకుల తనిఖీలో సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంకులలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ హెచ్చరించారు. మండలంలోని రాయవరం వద్ద పెట్రోల్, డీజిల్ బంకులలో గురువారం ఆకస్మిక తనిఖీ తహసీల్దార్ చిరంజీవితో కలిసి చేశారు. బంకులలో పంపు మిషన్‌లను, వాటిలో పొందుపరిచిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. నిర్వాహకులతో త్రివినాగ్ మాట్లాడుతూ కొలతలు, నాణ్యత విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మార్కాపురం రోడ్‌లో ని పెట్రోల్ బంక్‌ను గురువారం తహసీల్దార్ మంజునాథరెడ్డి తనిఖీ చేశారు. పెట్రోల్ కొట్టే మిషన్, మీటర్ రీడింగ్‌ను పరిశీలించారు. బంకుల వద్ద వినియోగదారులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కొలతల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లైన్ మెయింటినెన్స్‌ల కారణంగా 26వ తేదీ శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33కేవీ అంబవరం ఫీడర్‌లైన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ బి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా పీఆర్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొంగళవీడు, ఎన్‌బయనపల్లి, నల్లగట్ల, బ్రాహ్మణపల్లి, ముండ్లపాడు, బురుజుపల్లి, కేఎస్‌పల్లి, కంచిపల్లి, అంబవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, గమనించాలని పేర్కొన్నారు.



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. చెన్నకేశవస్వామి కోనేరును శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కందుల రామిరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జునరావు, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పరిసరాల పరిశుభ్రతలోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో బాల చెన్నయ్య తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో గురువారం స్వచ్ఛ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ బట్టగిరి గౌతమి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో కంభం, కందులాపురం పంచాయతీ కార్మికులు పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ విజయలక్ష్మి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాచర్ల : గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా గౌతవరం అనుములపల్లి, రాచర్ల గ్రామాల్లో ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమ పనులను ఆయన పరిశీలించారు. గ్రామాలన్నీ పరిశుభ్రంగా, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, డిప్యూటీ ఎంపీడవో ఐ వెంకటేష్, ఉపాధిహామీ ఏపీవో ఆర్ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు వీ అనిల్‌కుమార్, ఏవీ సురేష్, ఎంవీ నాయక్, టీడీపీ నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు, పాపిశెట్టి శ్రీనివాసులు, అనుములపల్లి గౌతవరం సర్పంచ్‌లు శిరిగిరి రమేష్, మార్తోట లక్ష్మీదేవి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఖాదర్‌వలి స్వామి దర్గా నుంచి విశ్వభారతి పాఠశాల వరకు నిర్వహించారు. రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తచెదారాన్ని తొలగించారు. పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోర్సియా, ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.





నాడు విస్మరించి.. నేడు ఓర్వలేక విమర్శలా

ప్రభుత్వం చేపట్టే పనులపై వైసీపీ నేతల అబద్ధాలు : రామిరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలకులు పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపారని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. అభివృద్ధి పనులను వారు విస్మరించి తాజాగా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మెడికల్ కళాశాలపై వైసీపీ నాయకులు అబద్ధ ప్రచారాలు చేయడాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తిప్పికొట్టారన్నారు. మార్కాపురం జిల్లా, మెడికల్ కాలేజీ, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. 2026 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తిచేసి నీళ్లిచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మున్సిపల్ మాజ చైర్మన్ డి.నాగూర్‌వలి, నాయకులు షేక్ మౌళాలి, షెక్షావలి, బాబీ, గులాబ్, గఫార్, వలి పాల్గొన్నారు.







మహిళల ఆరోగ్యమే లక్ష్యం

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా స్వస్థ్ నారీ సశక్త్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని డాక్టర్ రోహిత్ నాయక్ తెలిపారు. మండలంలోని కొట్టాలపల్లిలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ అమర్నాథ్‌రెడ్డి, ఏఎన్‌ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ లోహిత, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రూత్‌మేరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాచర్ల : ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించగలడని రామాపురం సొసైటీ బాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని ఎడవల్లిలో గురువారం అనుములవీడు వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. అనంతరం 120 మందికి డాక్టర్ కే రమేష్ వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రంగనాయకులు, ప్రసాద్, వీరాకుమారి, శ్రీనివాసులు, షమీం లక్ష్మీ, సిహెచ్‌ఓలు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కనిగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాహితం కోసం గంట పాటు పరిసరాల పరిశుభ్రత పనులు చేసేందుకు కలసిరావాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల ప్రకారం ఏక్‌దిన్ ఏక్ గంట ఏక్ సాత్ స్వచ్ఛతాహి శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంగణంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమ ంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

పామూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడి శ్రీను, హరగోపాల్, జె .వెంకటసుబ్బయ్య, హజరత్, పందిటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలి

» కలెక్టర్ రాజాబాబు



ప్లాంట్ నిర్మాణ పనులపై కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్, జేసీ

పీసీపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. పీసీపల్లి మండలంలోని దివాకరపురంలో సీబీజీ ప్లాంట్ భూమిని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం రిలయన్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఆయన ప్లాంట్ నిర్మాణ పురోగతి, కేటాయించిన భూముల వివరాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఈ ప్లాంట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, సీబీజీ ప్లాంట్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ టి.బాబు, ప్లాంట్ సివిల్ హెడ్ వెంకట్రావు, తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో జీవీ క్రిష్టారావు, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తొలిప్రాధాన్యత ఇచ్చిన బెంగుళూరు-కడప-విజయవాడ గ్రీన్‌హోల్డ్ హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణ పనులు నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తాళ్లూరు మండలంలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్‌లతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణపనుల్లో క్షేత్రస్థాయిలో సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. మండలానికి వచ్చిన కలెక్టర్ రాజాబాబును ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైఎస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్, టీడీపీ నాయకుడు వేణుబాబులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఇన్‌చార్జ్ ఆర్డీవో కళావతి, నేషనల్ హైవే పీడీ అనీల్‌కుమార్, తహసీల్దార్ బీవీ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పీసీపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅలవపాడులో ఎంపీడీవో జీవీ క్రిష్టారావు ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి వీధులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సురక్షిత కుటుంబం

పామూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంతోనే కుటుంబాలు సురక్షితంగా ఉంటాయని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని అంకాలమ్మవీధి దేవస్థానం ప్రాంతంలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, డాక్టర్ రవళి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, బొబ్బూరి రమేష్, బి.వెంగయ్య, సీహెచ్ వెంకట్‌రెడ్డి, ఎస్‌సీ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి!

దొనకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఇన్‌చార్జ్ ఎంపీడీవో దావూద్ అన్నారు. గురువారం స్థానిక చెత్త సంపద కేంద్రం వద్ద గ్రామ కార్యదర్శి పోట్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏక్‌దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దొనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు.

రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణంతో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ రాజాబాబును కలిశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణ పనులవల్ల అధికంగా వాహనాలు తిరుగుతున్నందున తాళ్లూరు-శివరాంపురం వరకు గలరోడ్డు పూర్తి దెబ్బతిని ప్రజలు రాక పోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు శాలువాలతో సత్కరించారు.

మూడు నెలలుగా బట్వాడా చేయని అసిస్టెంట్ పోస్టుమాస్టర్

ముండ్లమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ళ పోస్టాఫీసులో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న అత్యాల ప్రసన్న కుమార్ గత మూడు నాలుగు నెలలుగా బట్వాడా చేయకపోవడంతో గురువారం కొందరు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అద్దంకి డివిజన్ ఎంవో మెయిల్‌వర్స్ కె.శ్రీనివాసరావు గ్రామానికి వచ్చి అసిస్టెంట్ బీపీఎం అద్దెకు ఉంటున్న గదిని పరిశీలించారు. గత మూడు నాలుగు నెలల నుంచి వివిధ ఉత్తరాలు పంపిణీ చేయకుండా అలాగే ఉంచారు. వెంటనే ప్రసన్నకుమార్‌ను సస్పెండ్ చేశారు.

శ్రీకాత్యాయనీదేవిగా అమ్మవారు



దర్శిలో కాత్యాయనీదేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు

దర్శి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో దసరా పండుగ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా నిర్వహిస్తున్న శరన్నవ రాత్రుల వేడుకల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తూ పూజలందుకుంటున్నారు. స్థానిక కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు గురువారం శ్రీకాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో గురువారం శ్రీ కాత్యాయనీ దేవిగా శ్రీఈశ్వరీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముండ్లమూరు: ముండ్లమూరులోని బ్రహ్మగారి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మను గురువారం కాత్యాయనీదేవి అవతారం లో అలంకరణ చేశారు. అలాగే, పులిపాడు, ఈదర, మారెళ్ళలోని ఆల యాల్లో అమ్మవార్లను కాత్యాయనీదేవిగా అలంకరణ చేశారు.

పీసీపల్లి: శరన్నవరాత్రుల సందర్భంగా నాల్గవ రోజైన గురువారం మల్లేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అవతా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం లలితాసహస్ర నామస్తోత్రం పూజ, అష్టోత్తరపూజ కార్యక్రమాలను అర్చకస్వాములు పలుకూరి సుబ్బారావు, పలుకూరి శ్రీకృష్ణశివభరద్వాజశర్మ జరిపించారు. అనంత రం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో జ్ఞానప్రసూనాంబ గురువారం మధుర మీనాక్షి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. అర్చకులు కురిచేటి సుబ్బారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..



ప్రభుత్వ ఆసుపత్రిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న డాక్టర్ లక్ష్మి, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏక్ గంట ఏక్ సాత్ స్వచ్ఛ హిత సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు టీడీపీ నాయకులతో కలిసి చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా క్రమంతప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది వారి విధి నిర్వహణతో పాటు పరిశుభ్రతను కూడా అందులోభాగంగా పరిగణించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి.కల్పన, వైద్యాధి కారి డాక్టర్ ఆనంద్‌బాబు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన డాక్టర్ లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకోజనపల్లి పంచాయతీ లూధగిరి కాలనీలో గురువారం నీటి కుంటలో పడి కవలలు అఖిల్(11), నిఖిల్(11) మృతిచెందారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు మృతదేహాలను సందర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి ఓదార్చే ప్రయత్నం చేశారు. అన్నివిధాలుగా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఆమె వెంట దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ముండ్లమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఏవో ఏ.తిరుమలరావు అన్నారు. గురువారం మండలంలోని పెద ఉల్లగల్లులో లక్ష్మీ ట్రేడర్స్ దుకాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. అలాగే, ముండ్లమూరు, పెదఉల్లగల్లు, శంకరాపురం పెట్రోల్ బంకులను తహసీల్దార్ పరిశీలించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

వెలిగండ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి బి.రవికుమార్ అన్నారు. గురువారం మరపగుంట్ల పంచాయతీలో వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు) : పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ బి.రవికుమార్ అన్నారు. గురువారం సీఎస్‌పురం మండలం సినాగులారం గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ ఆర్.రమేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్, తదిత రులు పాల్గొన్నారు.

కనిగిరి: గాలికుంటు వ్యాధి పట్ల పశు పోషకులు తగు జాగ్రత్తలు వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ రవికుమార్ అన్నారు. మండలంలోని నిమ్మమహేశ్వరపురం , కలగట్ల, రాచగుండ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని గురువారం ఏడీఏ గజ్జెల శ్రీనివాసరెడ్డితో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా పశు పోషకులకు పలు సూచనలు చేశారు.

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

1 ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

రేపల్లె, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం శుభావార్త చెప్పింది. పత్తి పంటను ఇష్టమైన కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వెసులు బాటు కల్పిస్తూ జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు రైతులు పండించిన పత్తిని అదే మండలంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రాయించాల్సి వచ్చేది. దాని వల్ల సరైన ధర దక్కడం లేదని రైతులు ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం గత నిబంధనలను సవరించింది.

రేషన్ అక్రమ రవాణాకు రెడ్ సిగ్నల్

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వం 'రెడ్' సిగ్నల్ వేసింది. నల్లబజారుకు తరలే పేదల బియ్యాన్ని 'రెడ్'హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రత్యేక పరీక్ష కిట్లను పౌరసరఫరాల శాఖకు అందజేసింది. జిల్లాల వారీగా వీటిని పంపిణీ చేసింది. అక్రమార్కులపై అక్కడికక్కడే 6ఏ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాధారణ బియ్యం మాటున జరిగే.. చౌక బియ్యం అసలు 'రంగు' తేలికగా తేలనుంది.

- స్పాట్‌లోనే పేదల బియ్యం గుర్తింపు
- పరీక్షలకు పౌరసరఫరాల శాఖకు ప్రత్యేక కిట్లు
- జిల్లాలకు ఇప్పటికే పంపించిన ప్రభుత్వం
- నల్లబజారు వ్యాపారులకు ఇక 'రంగు' పడనుంది..!





పీడీఎస్ బియ్యం నిర్ధారించే కిట్

(పర్చూరు, ఆంధ్రజ్యోతి)

పేదలకు బలవర్థక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ బియ్యం అంటారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే చౌక బియ్యాన్ని.. అక్రమార్కులు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బియ్యం నిల్వలు పట్టుబడినా.. అక్కడికక్కడే వాటిని నిర్ధారించే పరిస్థితి గతంలో లేదు. కానీ, ఇక నుంచి లెక్క వేరేలా ఉండనుంది. నల్లబజారులో పేదల బియ్యాన్ని స్పాట్‌లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు. ఇందుకు ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్‌లను జిల్లాకు 7 నుంచి 10 వరకు ప్రభుత్వం అందజేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని నిర్ధారించడమే కాకుండా వెనువెంటనే 6ఏ కేసు నమోదుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కిట్లు కాకినాడ పోర్టులో ఉండేవి. పోర్టుకు వచ్చే బియ్యం నిల్వలను కిట్ ద్వారా పరీక్షించేవారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గానికి పరీక్ష విధానాన్ని తీసుకొచ్చారు.

బియ్యం ఫోర్టిఫైడ్ ఇలా..

మార్కెట్‌లో సాధారణ బియ్యానికి.. ప్రభుత్వం అందించే చౌక బియ్యానికి చాలానే తేడా ఉంది. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని ఫోర్టిఫైడ్ చేసి.. పేదలకు సరఫరా చేస్తోంది. ఈ బియ్యంలో పోషకాలు ఉంటాయి. ఇందులో కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలుపుతారు. ముందుగా బియ్యాన్ని పిండిగా మారుస్తారు. అందులో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. అనంతరం ఆ పిండిని మళ్లీ బియ్యం కెర్నెల్స్(గింజలు)గా మార్చుతారు. క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలుపుతారు. ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార లోపం కూడా ఉండకూడదన్న లక్ష్యంతో అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీలో ఈ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతేడాది నుంచి ఈ విధానం పూర్తి స్థాయిలో (మిగతా 6వ పేజీలో)

ఎస్సీలకు రుణాలు

- జిల్లాల వారీగా లక్ష్యాల నిర్దేశం
- రాయితీపై యూనిట్లకు కార్యాచరణ
- కార్పొరేషన్‌ను గాడిన పెట్టే దిశగా ప్రభుత్వం



2852 యూనిట్లు.. రూ.38 కోట్ల రాయితీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే యూనిట్లకు సంబంధించి జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. బాపట్ల జిల్లాలో వివిధ కేటగిరీల్లో 912 యూనిట్లు కేటాయించగా ఇప్పటికే 2,500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో 990, పల్నాడు జిల్లాలో 950 యూనిట్లకు దర ఖాస్తులు ఆహ్వానించగా దాదాపు 5,000 వరకు వచ్చాయి. మూడు జిల్లాలకు ప్రభుత్వం కేటాయించిన రుణాలు రూ.95 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో రాయితీ రూ.38 కోట్లు, బ్యాంకులు అందించే రుణ సదుపాయం రూ.45 కోట్ల వరకు ఉండనుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం కల్పించేలా ప్రస్తుత ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన ఎస్సీ యువతకు రాయితీపై రుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రాయితీపై అందించే యూనిట్లకు లక్ష్యం నిర్దేశించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఎస్సీ కార్పొ రేషన్ ద్వారా రాయితీ అందించి యూ నిట్లు పెట్టేలా ప్రోత్సహించేది. దాదా పు ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రాయితీపై యూనిట్లు అందించే కార్యక్రమానికి కసరత్తు జరుగుతుండడంపై ఎస్సీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల కంటే ఇప్పటికే మూడు రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో త్వరలోనే మండలాల వారీగా వాటి పరిశీలన ప్రక్రియకి ఎస్సీ కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. మండల స్థాయి అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత అవి కలెక్టర్ లాగిన్‌కు చేరడం, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి నివేదిక తర్వాత లబ్ధిదారుల తుది ప్రకటన వెలువడనున్నది.

మూడు కేటగిరీలు..

ఎస్సీ యువతకు రాయితీపై అందించే రుణాలను మూడు కేట గిరీల్లో విభజించనున్నారు. మొదటి విభాగంలో మూడు లక్షల్లోపు, రెండో కేటగిరీలో మూడు నుంచి ఐదు లక్షల్లోపు, మూడో విభాగంలో పది లక్షల్లోపు యూనిట్లను అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా కేటగిరీల్లో ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న దానిపై తర్జనభర్జన జరుగుతున్నట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్ అందించిన వివరాల ప్రకారం సాంకేతికపరమైన యూనిట్లకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందులో ఐటీ సేవలు మొదలు వెబ్‌సైట్ రూపకల్పన వరకు ఉన్నాయి. సెల్‌ఫోన్ రిపేర్ షాపులు, స్టేషనరి తయారీ, సోప్స్‌తో పాటు సౌందర్య సాధనాల తయారీ యూనిట్లకు రాయితీలో చోటు కల్పించనున్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు జవసత్వాలు అందించడంతో పాటు గతంలో లబ్ధి పొందిన వారు బకాయిలు చెల్లించడంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.36 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో బాపట్ల జిల్లా వాటా రూ.8 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కే ఎఫ్‌డీసీకి సంబంధించిన రుణాలు ఈ బకాయిల్లో ఉన్నాయి. బకాయి దారులకు గతంలోనే ఓసారి నోటీసులివ్వడం జరిగిందని, ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

ప్లాస్టిక్ రహితమే లక్ష్యం

1 చీరాలలో స్వచ్ఛతా హి సేవలో కలెక్టర్

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను మార్చడమే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని కలెక్టర్ డా.వినోద్ కుమార్ తెలిపారు. గురువారం చీరాలలో స్వచ్ఛతా హి సేవ శ్రమదానం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నెహ్రూ కూరగాయల మార్కెట్ నుంచి గడియార స్తంభం కూడలి వరకు రహదారులను కలెక్టర్ శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛమైన పర్యావరణం అందుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. క్లాత్ సంచుల వినియోగిస్తాం.. ప్లాస్టిక్ నిషేధి స్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.


శ్రమదానంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, ఏఈ రవికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మూడో లైన్‌పైనా.. రయ్‌రయ్

1 నిడుబ్రోలు - అప్పికట్ల పట్టాలపై స్పీడ్‌టెస్టు

తెనాలి అర్బన్, దుగ్గిరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- గుంటూరు మార్గంలో నిర్మించిన మూడో రైల్వేలైనులో గురువారం కమిషనర్ ఆఫ్ రైల్వేసేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్ట్‌రన్ నిర్వహించారు. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండా రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తేల్చారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేశారు. మూడో లైను పటిష్ఠంగా ఉందని రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి చెప్పారు. ప్రాజెక్టు మేనేజర్ శేఖర్‌సాహు, ఇంజనీరింగ్ అధికారుల బృందం ఈ లైనును పరిశీలించింది. పెదవడ్లపూడి నుంచి చుండూరు వరకు స్పీడ్ టెస్టు నిర్వహించారు. రైలు వేగంగా వెళ్లేటప్పుడు స్థిరత్వం, ట్రాక్‌లో కదలికలు, బ్రిడ్జి, సిగ్నల్స్, ఎలక్ట్రిఫికేషన్, ప్రయాణికుల భద్రత అంశాలను పరిశీలించారు. 140 కి.మీ వేగంతో స్పీడు టెస్టు చేయగా, ఒకదశలో వేగాన్ని 148కి.మీ వరకు పెంచినప్పటికి ట్రాక్ పటిష్ఠంగా ఉందని గుర్తించారు. శుక్రవారం నుంచి ట్రాక్‌ను వినియోగంలోకి తేనున్నట్లు చెప్పారు. స్పీడ్ టెస్టులో డీఆర్ఎం మోహిత్ తో పాటు పలు విభాగాలకు చెందిన రైల్వే అధికారులు పాల్గొన్నారు.


మూడో లైనును పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, ప్రాజెక్టు మేనేజర్ శేఖర్‌సాహు, ఇంజనీరింగ్ అధికారులు

కాల్వలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

బాపట్లరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాల్వలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా అతని మృతదేహం గురువారం సూర్యలంక పొగరు వద్ద లభ్యమైంది. బాపట్ల రూరల్ పోలీసులు వివరాల మేరకు.. బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామానికి చెందిన వీరభద్రరావు (62) అనే వ్యక్తి కిరణా కొట్టు నడుపుకుంటూ ఒంటరిగా జీవితం సాగిస్తున్నాడు. మానసికంగా కృంగిపోయిన వీరభద్రరావు మూడు రోజుల క్రితం నాగరాజు కాల్వలో దూకాడు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించి,కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం సేకరణపై కసరత్తు



1 2 లక్షల టన్నులకు పౌర సరఫరాల శాఖ ప్రతిపాదనలు 1 గత అనుభవాలతో ముందుగా మేల్కొన్న యంత్రాంగం 1 ప్రభుత్వం మొగ్గు లక్ష టన్నులే..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పౌర సరఫరాలశాఖ ప్రభుత్వానికి భారీగానే నివేదికలు పంపింది. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని.. మద్దతు ధరకు కొనుగోలు చేసేలా అనుమతులివ్వాలని ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియలో అనేక ఇబ్బందులను రైతులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క సంవత్సరం కూడా ఖరీఫ్ సీజన్‌లో 30,000 టన్నులకు మించి ధాన్యం సేకరించిన దాఖలాలు లేవు. గతేడాది ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 92,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఓ విధంగా గతేడాది సేకరించిందే గరిష్ఠ పరిమాణంగా ప్రభుత్వం భావించింది. కానీ, ఇప్పుడు ఏకంగా రెండు లక్షల టన్నుల సేకరణకు పౌర సరఫరాలశాఖ అంచనాలు వేసి పంపడంతో ఏ మేరకు గ్రీన్‌సిగ్నల్ వస్తుందో తెలియాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కేటాయింపుల్లో జిల్లా వాటా లక్ష టన్నుల లోపే ఉండొచ్చనేది సమాచారం. ఇదే స్థాయిలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గత ఖరీఫ్‌లో మూడు సార్లుగా ప్రతిపాదనలు

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో తొలుత 50,000 టన్నుల సేకరణకే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగుబడులు ప్రారంభం అయిన నెలన్నరకే ఈ లక్ష్యం చిన్నబోయింది. తర్వాత ధాన్యం సేకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి నివేదించి.. మూడు సార్లుగా మరికొంత సేకరణకు అధికారులు, నేతల కృషితో అనుమతులు తెచ్చుకోగలిగారు. అదనంగా 42,000 టన్నుల ధాన్యం మద్దతు ధరకు సేకరించారు. దీంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు

మళ్లీ కొనుగోలు కేంద్రాల బాట

వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం సేకరణ అంశాన్ని ఓ ప్రహసనంగా మార్చారు. దీంతో రైతులు అయినకాడికి బహిరంగ మార్కెట్‌లోనే అమ్ముకుని సరిపెట్టుకున్నారు. అరకొరగా సేకరించిన ధాన్యానికి డబ్బులు జమ చేయడంలో వైసీపీ ప్రభుత్వం నెలల తరబడి జాప్యం చేసింది. సీజన్‌లో 30,000 టన్నుల లక్ష్యం చేరుకోవడమే గగనంగా ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగానే డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తోంది. గోనె సంచుల కొరతపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొనుగోలు కేంద్రాల బాట పట్టే అన్నదాతల సంఖ్య గత సీజన్‌లో గణనీయంగా పెరిగింది.

తప్పులు పునరావృతం కాకుండా...

జిల్లాలో సాగు విస్తీర్ణంలో దాదాపు 80 శాతం వరి పంటే ఉంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో దిగుబడులు మొదలుకుని, బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను అంచనా వేయడంలో వ్యవస్థల వైఫల్యం.. రైతుల పాలిట శాపంగా మారింది. మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీల విషయంలో కూడా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురు కావడంతో ధాన్యం సేకరణకు ప్రతిబంధకాలుగా మారాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అలాంటి ఇబ్బందులేవీ తలెత్తకుండా ముందస్తు చర్యలపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. ధాన్యం సేకరణకు సంబంధించి భారీగా ప్రతిపాదనలు పంపడంతో సరిపెట్టకుండా వాటిని గరిష్ఠంగా సాధించుకోవడానికి నేతల వైపు నుంచి కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సి ఉంది. మిల్లర్ల మాయాజాలంపై గతంలో అనేక విమర్శలు వచ్చాయి. దీనికి విరుగుడుగా గతేడాదే ప్రభుత్వం ధాన్యం రవాణా విషయంలో జీపీఎస్‌ను తప్పనిసరి చేసింది. దీనిని ఈ సీజన్‌లో పక్కాగా అమలయ్యేలా చూస్తే అవకతవకలకు చాలా వరకు బ్రేక్ పడనున్నాయి.

నాలుగు గ్రామాల్లో.. మ్యాజిక్ డ్రైయిన్లు

1 హార్టికల్చర్ రైతులకు రూ.6.50 కోట్ల రాయితీ
1 ఆంధ్రజ్యోతితో ఉపాధి పీడీ విజయలక్ష్మి



వేమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్ర వాతావరణంలో తీర్చిదిద్దేందుకు నాలుగు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఉపాధి హామీ పథకం పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణ పనులను బలిజేపల్లి, వేమూరు గ్రామాల్లో గోకులం షెడ్లను, జంపనిలో హార్టికల్చర్ తోటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వేమూరు మండలంలోని పోతుమర్రు, మార్టూరు మండలంలోని చిమ్మిరిబండ, చిన్నగంజాం మండలంలోని నీలాయపాలెం, అద్దంకి మండలంలోని విప్పర్లవారిపాలెం గ్రామాలను మోడల్‌గా తీసుకుని మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఎక్కడా మురుగునీరు నిల్వకుండా, నీరు ఎక్కువైతే భూమిలోకి ఇంకిపోయేలా మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగు గ్రామాల్లో 2595 మీటర్ల మేర నిర్మాణం జరుగుతుందన్నారు.జిల్లాలోని 624 ఎకరాల్లో ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. 508 మంది రైతులు వివిధ పండ్లతోటల సాగుకు ముందుకు వచ్చారని, వారికి రూ.6.50 కోట్లు రాయితీ రూపంలో మంజూరు చేశామన్నారు. జిల్లాలో 453 మినీగోకులం షెడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 45 లక్షల ఉపాధి పని దినాలను లక్ష్యంగా పెట్టుకోగా 50 లక్షల పని దినాలను పూర్తిచేసి ఇందుకు రూ.138 కోట్లు వ్యయం చేశామన్నారు. గ్రామాల్లో కంపోస్ట్ బిట్స్ నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇళ్లలో వినియోగించిన వ్యర్థాల్ని కంపోస్టు బిట్స్‌లో వేసి శుభ్రమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు.

అర్హులందరికీ సంక్షేమం అందాలి

1 సూపర్‌సిక్స్ సమర్థంగా అమలు చేయాలి
1 అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ యోజన తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలుపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సమర్థంగా అమలు చేయాలన్నారు. అన్నదా త సుఖీభవ పథకంలో రైతులకు ప్రయోజనం కల్పించేలా రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్ కరెక్షన్ చేయాలన్నారు. ఆర్టీసీ డిపోలలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. వసతి గృహాల మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలన్నారు.

అందుబాటులో 112 ఎంటీల యూరియా

జిల్లాలో రైతులకు అందించేందుకు 112 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాలు 26 ద్వారా గురువారం 318 మెట్రిక్‌టన్నుల యూరియాను 3,452 మంది రైతులకు పంపిణీ జరిగిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ లవన్న, సంక్షేమశాఖాధికారులు జె.రాజాదెబోరా, శివలీల, ప్రజారవాణాధికారి బి.సాంబ్రాజ్యం పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పేద విద్యార్థుల ఎదుగుదలకు సహకరిస్తాం



దాట్లరాజును సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు తమ చదువులు కొనసాగించి ఉన్నతంగా ఎదిగేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానని రెకోమాక్స్ కాంట్రాక్ట్ కంపెనీ డైరక్టర్ దాట్లరాజు అన్నారు. పంగులూరులో గురువారం మండల విశ్వబ్రాహ్మణసంఘం నిర్వహించిన జాతీయసేవాదినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకటాపురం ఆచారి, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, పామర్తి శ్రీనివాసులు, బాబూజి, శ్రీనావాసాచార్యులు, ఓంకారశర్మ, కోటపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటరమణకు సత్కారం

అద్దంకిటౌన్ : సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా ఏల్చూరి వెంకటరమణను ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వెంకటరమణ దంపతులు సంఘ సభ్యులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళగడ్డ వీరసుందరాచారి, పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యాయుడు కొండమూది రమేష్, జిల్లా కార్యదర్శి గుండెమెడ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చంద్రమౌళీయం' పుస్తక ఆవిష్కరణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 27న విద్వాన్ జ్యోతిచంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం వజ్రోత్సవ సంచిక ఆవిష్కరించనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యూ.దేవపాలన తెలిపారు. గురువారం జానపద కళాపీఠం సభ్యులు సంచిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులుతో పాటు విశిష్ట అతిథులుగా మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు విస్తాలి శంకరరావు, ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. వెంకటేశ్వరరెడ్డిలు హాజరవుతారన్నారు.

ప్రధానకూడలి వైపుగా బస్సును నడపాలి

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నుంచి బూదవాడ వైపుగా ఇంకొల్లుకు నడిచే ఆర్టీసీ సర్వీస్ పంగులూరు ప్రధాన కూడలి వైపుగా నడిచేవిధంగా చర్యలు చేపట్టాలని పంగులూరు పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు. బూదవాడ ఉన్నత పాఠశాలకు చేరుకునే పాఠశాల విద్యార్థులతో పాటు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అద్దంకి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు బాపట్లకు చెందిన సురేంద్రనాథ్, నాగరాజులు స్కూటీపై అద్దంకిలో బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం తిరిగి వెళుతుండగా రాజీవ్‌కాలనీ సమీపంలో నామ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సురేంద్రనాథ్, నాగరాజులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అద్దంకి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో వెళ్తున్న కారును ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచి బయటకు వస్తున్న బస్సు ఢీ కొట్టింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు కారు వెళుతోంది. గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ లో నుండి నామ్ రోడ్డు లోకి వస్తున్న ఇంకొల్లు బస్ పక్క నుంచి ఢీ కొట్టింది. దీంతో వెంటనే బస్ కూడా ఆగడంతో ప్రమాదం తప్పి పోయింది. కారులో చిన్నపిల్లలతో పాటు కుటుంబసభ్యులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు, రేపు ఏఎస్ఆర్ శిక్షణ తరగతులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేడు, రేపు వేటపాలెం మండల కార్యాలయంలో ఓఆర్ఎస్(ఓన్ సర్వీసెస్ రెవెన్యూ)పై శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు ఎంపీడీవో రాజేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో అన్ని పంచాయతీల సెక్రటరీలు, గ్రేడ్-5 కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ వారి ఆధార్ కార్డు జిరాక్సుతో సహా శిక్షణకు హాజరుకావాలని చెప్పారు.

ప్రజల వైద్య సేవలపట్ల నిర్లక్ష్యం తగదు

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే వైద్యసేవల్లో నిర్లక్ష్యం ఉండరాదని మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు చెప్పారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పాపరాజుతోట అర్బన్ హెల్త్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరుగుతున్న మెడికల్ క్యాంపుకు చైర్మన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూల్లో ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఏఈ గీత, ఇంజనీరింగ్ ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి వచ్చింది.

'రెడ్' హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు..!

ఫోర్టిఫైడ్ బియ్యంను నిర్ధారించేందుకు కిట్‌లో రెండు కెమికల్స్ ఉంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యపు గింజలపై కెమికల్ చుక్కలు వేయగానే అవి ఎరుపు రంగులోకి మారుతాయి. ఎందుకంటే ఈ ఫోర్టిఫైడ్ గింజల్లో విట మిన్లు కలిసి ఉండటమే. ఇలా రేషన్ బియ్యాన్ని ఇక నుంచి నిర్ధారించవచ్చు. చిన్న బియ్యం ఆకారపు గింజ లను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు. ఈ బియ్యం పంపిణీ అమల్లోకి వచ్చిన కొత్తలో చైనా బియ్యం, ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రజలు అపోహలకు గురయ్యారు. ఈ బియ్యపు గింజలు.. నీటిలో తేలాడుతాయని, అందువల్లే వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు భావించారు. ఈ అపోహలను పౌరసరఫరాల శాఖ నివృత్తి చేసింది.

నియోజకవర్గానికి ఒక కిట్..

ప్రతి జిల్లాకు ఈ కిట్లు సరఫరా అయ్యాయి. ఒక కిట్ జిల్లా సరఫరా అధికారి వద్ద ఉంటుంది. పౌర సరఫరాల టీటీలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేశారు. కిట్ల సంఖ్య ఇంకా పెరగనుంది. మొత్తం మీద చౌక బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

కాత్యాయనీదేవిగా జగన్మాత

● చీరాలలో రూ.2 లక్షల నగదుతో విశేష అలంకరణ

● అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

పంగులూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మ వారిని కాత్యాయినీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. కాత్యాయినీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మ వారిని దర్శించుకున్నభక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గురువారం కాత్యాయిణిదేవి అవతారంలో దర్శనమిచ్చిన త్మ్మవారికి ముందుగా గణపతిపూజ, నవావర్ణపూజ, కలశ స్థాపనగావించారు. స్వామివారికి అభిషేకము, సూక్తహోములు నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్రార్చనము, శ్రీలలితసహస్రనామము, కుంకుమార్చనపూజ శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మండలంలోని ముప్పవరం, రేణంగివరం, కొండమూరు, రామకూరు గ్రామాలతోపాటు పంగులూరు, చందలూరు, నూజెళ్లపల్లె పరిసర గ్రామాలలో శ్రీదేవీశరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో ఉన్న దేవాలయాలలో దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నక్కబొక్కల పాడు, కొత్తపాలెం గ్రామాలలో ఉన్న పోలేరమ్మ తల్లి దేవాలయాలలో నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజ కార్యక్రమాలలో పాల్గొంటు ప్రత్యేక భజనలు నిర్వహిస్తున్నారు. అలానే అంబడిపూడి శివాలయం, కొప్పెరపాడు బొడ్డు రాయి సెంటర్, వేమవరం ఎస్టీ కాలనీలలో దసరా నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా రాత్రి 12 గంటల వరకు భజనలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. రోజుకు ఒక రకమైన అలంకరణలతో దుర్గాదేవిని ముస్తాబు చేస్తున్నారు. అద్దంకి :దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో బాగంగా అద్దంకి పట్టణంలోని పలు దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కాత్యానీదేవిగా, దత్తపాదుకా క్షేత్రంలో మీనాక్షీ దేవిగా అలంకరించారు. వేయిస్తంభాలగుడి, కమటేశ్వరాలయం, ఇతర దేవాలయాలలో కూడా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.











అద్దంకిలో మీనాక్షిదేవిగా అమ్మవారు, నక్కబొక్కలపాడులో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, చీరాలలో నగదుతో అలంకరణ

చీరాల : స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం రూ. 2 లక్షల నగదుతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే శివానందలహరి పారాయణంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాలుగవ రోజు అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. పూజలు అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేణంగివరం త్రిశక్తిపీఠంలో, అద్దంకిలో వాసవీమాత ఆలయంలో కాత్యాయనిదేవి అలంకరణ

పర్చూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను మండలంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీ కాత్యానిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవ వేడుకల అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ రాకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి దామా నాగేశ్వరరావు సారధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోలీసులు అభద్రతా భావంతో ఉండొద్దు

● ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

● సైబర్, ఆన్‌లైన్, గంజాయి, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది అభద్రతా భావంతో పనిచేయాల్సిన అవసరం లేదని, కచ్చితమైన శాంతిభద్రతల కోసం పాటు పడాలని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. గురువారం ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతే కాకుండా పీజీఆర్ఎస్ పెండింగ్‌లపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ చీరాల పరిధిలోని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రౌడీ షీటర్‌ల ప్రత్యేక శైలిని గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. వీటి నియం త్రణకు ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. అలాగే గంజాయి, శాంతి భద్రతలపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అమాయక ప్రజలకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని మాట్లాడారు. ఎస్పీ వెంట రూరల్ సిఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వరరావు

వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన



వైద్యశాలను సందర్శించిన హైస్కూల్ విద్యార్థులు

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పి. అంజనీదేవి తెలిపారు. గురువారం మేదరమెట్ల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను మేదరమెట్ల ప్రాథమిక వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య విద్యమీద అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్య గురించి విద్యార్థులకు వైద్యులు డాక్టర్ చిట్టిబాబు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పార్మాసిస్టు, ఏఎన్ఎం, స్టాప్ నర్సు, ఇతర విభాగాలలో బాధ్యతులు నిర్వహించే వారి గురించి వివరించారు. ఒకేషనల్ ట్రైనర్ కే.రమ్యలత మాట్లాడుతూ విద్యార్థులు అన్ని వృత్తి విద్యాల గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిబాబుతో పాటు డాక్టర్ శ్రావణి, డాక్టర్ మేర్సీ జోసఫ్, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో రైతులకు తగ్గనున్న ఖర్చు



రైతులకు వివరాలను తెలియజేస్తున్న ఏవో రామ్‌మోహన్‌రెడ్డి

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నూతన డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకుని ఖర్చులు తగ్గించుకోవచ్చని ఏవో రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రావినూతలలో వ్యవసాయ సాంకేతిక యాజమాన సంస్థ (ఆత్మ) సౌజన్యంతో డ్రోన్‌తో పురుగుమందుల పిచికారి ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ డ్రోన్‌తో పిచికారి చేసుకోవచ్చన్నారు. ఎరువులను పిచికారి చేసేటప్పుడు పురుగుమందులను కలపకూడదన్నారు. మినుము, మొక్కజొన్న పంటలపై డ్రోన్‌తో పురుగుమందులను పిచికారి చేసి చూపించారు. 12 లీటర్ల నీటితో ఒక ఎ కరానికి పురుగుమందులు పిచికారి చేయవచ్చన్నారు. దానికి అ నుగుణంగానే పురుగుమందులను కలుపుకోవాలన్నారు. 5 నిమిషాలలో పురుగుమందులు పిచికారి చేయడం పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆత్మ అధికారి రామిరెడ్డి, వీహెచ్ఏలు ప్రశాంతి, గోపి, రైతులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ధర్మకర్తల మండలి సభ్యులు

అద్దంకి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులైన 11 మంది సభ్యులు గురువారం రాత్రి తాడేపల్లిలో క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులుగా నియమితులైన చుండూరి మురళీసుధాకరరావు, ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీ ప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకటనారాయణమ్మ, దూళిపాళ్ల వెంకట రత్నం, గొర్రెపాటి పద్మజ, ఆరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కొనంకి సుబ్బారావులు మంత్రి రవికుమార్‌ను కలిశారు.



మంత్రితో ధర్మకర్తల మండలి సభ్యులు

గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం

మేదరమెట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాండిచేరి యూనివర్శిటీకి చెందిన 15 మంది విద్యార్థులు సామాజిక, ఆర్థిక పరిశోధన కోసం దైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రిచర్చ్ ఫౌండేషన్‌కు వచ్చారు. గురువారం వారంరోజుల పరిశోధన పూర్తి చేసుకున్న విద్యార్థులు గ్రామస్థులతో మాట్లాడి అన్ని కోణాలలో సమగ్ర అధ్యాయనం చేశామన్నారు. యూనివర్శిటీ ప్రొఫెసర్ కె. దేవన్ నాయకత్వంలో గ్రామ వ్యవస్థ, గ్రామ పరిపాలన, గ్రామీణ వృత్తులు, జీవన విధనాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన అంశాలపై విశ్లేషనాత్మక అధ్యాయనం చేశారు. కార్యక్రమంలోకిరణ్ జ్యోతి రిచర్చ్ పౌండేషన్ పౌండర్ ట్రష్టి కందెపు రాజశేఖర్, సొసైటి అధ్యక్షుడు మద్దినేని రాఘస్వామి, గుండపనేని ఆనంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రీసెర్చ్ ఫౌండేషన్ వద్ద విద్యార్థులు

దసరా మామూళ్లతో బెంబేలు

● సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అదనపు భారం

అద్దంకి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): దసరా మాముళ్ల వసూలు కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ పరిచయం ఉన్న బైక్ మెకానిక్‌లు మొదలు మున్సిపల్ కార్మికుల వరకు పలువురు చేతిలో పుస్తకాలు పెట్టుకొని దసరా మాముళ్ల వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు కొన్ని సంవత్సరాలుగా పలు రహదారుల వెంబడి మహిళలు సమూహాలుగా ఉండి వాహనచోదకుల నుండి మాముళ్ళు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో అద్దంకి, బల్లికురవ మండలాలలోని పలు ప్రధాన రోడ్లలో మహిళలు సమూహాలుగా నిలబడి వాహనచోదకుల నుండి బలవంతంగా దసరా మాముళ్ల వసూలు చేస్తున్నారు. ఇదో కొత్తరకం దందా అని స్థానికులు నోరెళ్లబెడుతుండగా, సామాన్యులకు మాత్రం జేబులకు చిల్లులు తప్పడం లేదు.

మ్యాజిక్ డ్రైన్ పనుల పరిశీలన

మార్టూరు, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో నిర్మిస్తున్న సోక్‌ఛానల్(మ్యాజిక్ డ్రైన్) పనులను గురువారం డ్వామా ఏపీడీ బి.సింగయ్య పరిశీలించారు. ఈ గ్రామంలో రూ.4లక్షలకు పైగా వ్యయంతో 700 మీటర్లు మ్యాజిక్ డ్రైన్ పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికీ పూర్తయిన 100 మీటర్ల పనులను సింగయ్య పరిశీలించారు. నాణ్యతతో పనులను పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అంతేగాకుండా వీలైనంత త్వరితంగా సైడుకాల్వల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు

● రూ.2.57 కోట్లు విడుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ

పర్చూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి సీసీ రోడ్లు, కల్వర్లు నిర్మాణం కోసం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 2.57 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆమేరకు గురువారం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్వర్వులు జారీచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పనులు చేపట్టనున్నారు.

విద్యా, వైద్య రంగాలకు కూటమి పెద్దపీట

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ గల నాయకులని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. గురువారం అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 16 వేల మంది కొత్త ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు వివరించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వైద్యచికిత్సల కోసం ఎల్‌వోసీ అందజేత

పంగులూరు, సెప్టెంబరు 25(ఆంధజ్యోతి):మండల కేంద్రమైన పంగులూరులో ఇద్దరు వ్యక్తులకు వైద్య ఖర్చులకోసం మంజూరైన ఎల్‌వోసీలను గురువారం బాధితులకు అందచేశారు. గ్రామానికి చెందిన పఠాన్‌జిలాని కుమార్తె పుట్టుకతో అనారోగ్యానికి గురయ్యారు. కాగా వైద్యఖర్చుల కోసం రూ.1.50లక్షలను మంజూరు చేశారు. అదేగ్రామానికి చెందిన మేడూరి చాముండేశ్వరికి ప్రమాద వశాత్తు కాళ్లకు గాయాలయ్యాయి. వైద్య ఖర్చుల నిమిత్తం ముందుగా, రూ.1.25 లక్షలను మంజూరు చేస్తూ ఎల్‌వోసీ మంజూరైంది. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో ఎల్‌వోసీలను టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ గురువారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి కోటేశ్వరరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

27 వార్డులుగా అద్దంకి మున్సిపాలిటీ



అద్దంకి పట్టణం వ్యూ

అద్దంకి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీని 27 వార్డులకు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అద్దంకి నగరపంచాయతీగా ఉన్నప్పుడు 20 వార్డులుగా ఉండగా, అనంతరం మున్సిపాలిటీ గా మార్పు చేశారు. 2026 లో జరిగే మున్సిపల్ ఎన్నికలకు 27 మంది కౌన్సిలర్లను అద్దంకి పట్టణ ప్రజలు ఎన్నుకోవాల్సి ఉంటుంది. 29వ తేదీ లోపు మున్సిపల్ అధికారులు 27 వార్డులుగా విభజించి హద్దులను నిర్ధారిస్తూ ప్రకటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అక్టోబర్ 6వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలనలోనికి తీసుకుంటామన్నారు. 14వ తేదీ నాటికి అన్ని స్థాయిలలో ప్రక్రియ పూర్తి చేసి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో 31,870 మంది ఓటర్లు ఉండగా జనాభా సుమారు 50 వేల వరకు ఉన్నారు.

ముప్పాళ్లలో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 25,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో ముప్పాళ్లలో నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు (68) గురువారం మృతి చెందగా గుంటూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. ఇటీవల మృతుడు వెంకటేశ్వర్లు కుమారుడు నాలుగు నెలల కిందట చనిపోగా నేత్రదానం చేశారు. మూడు నెలల కిందట భార్య మృతి చెందగా నేత్రదానం చేశారు. ఒకే కుటుంబంలో ముగ్గురు నేత్రదానం చేశారు.

ఓటరు జాబితా రివిజన్‌కు సహకరించాలి

● వివిధ రాజకీయ పార్టీలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూచన

అద్దంకి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా రివిజన్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి అన్నారు. పలు రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంగులూరు తహసీల్దార్ శింగారావు, అద్దంకి మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, పలు మండలాల డీటీలు,, టీడీపీ, వైసీపీల తరపున నాగినేని రామకృష్ణ, జ్యోతి హనుమంతరావు పాల్గొన్నారు.



నేతలకు సూచనలిస్తున్న విజయజ్యోతి కుమారి

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాజ్ఞలు


● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అక్టోబరు 2 నుంచి ప్లాస్టిక్ నిషేదాజ్ఞలు అమల్లోకి వస్తాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలు, స్థానిక ఎమ్మెల్యే కొండయ్య సూచనలు మేరకు ప్లాస్టిక్ నియంత్రణకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ప్లాస్టిక్ కవర్లు వినియోగం, అమ్మకాలు, నిల్వలు, తయారీ చట్టరీత్యా నేరమని సూచించారు. అలాగే గోవులను ఇష్టారీతిగా వదిలేసిన యజమానులపై చర్యలు తప్పవన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



అద్దంకి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీనరశింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. పలువురు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్ష్మీనరశింహస్వామి గ్రామోత్సవాలు ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నారు.



'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న వరద తగ్గింది. గురువారం 15,425 క్యూసెక్కులు రాగా డ్యాంలో 72.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నెల్లూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెయ్యి కిలోల వివిధ రకాల స్వీట్లతో మూలవర్లకు ప్రత్యేక అలంకారం



నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జయ జయ హే జగజ్జననీ!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వేడుకగా జరుగుతున్నాయి. వివిధ అలంకరణలలో కొలువుదీరుతున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటున్నారు. అభిషేకాలు, అర్చనలు, నవావరణ పూజలు, చండీ హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, సహస్ర దీపాలంకరణలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.

నెల్లూరులోని ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరిని వెయ్యి కిలోల స్వీట్లతో అలంకరించారు. రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాలతోపాటు జొన్నవాడ, రాపూరు, కావలి, సంగం, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మధుకైటభ వధ అలంకరణలో కామాక్షితాయి




రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పారదర్శకంగా ఓటర్ల
జాబితా నవీకరణ

● కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల వారు నూతన ఓటర్లకు అవగాహన కల్పించాలని, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రాలు పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలని కోరారు. బూత్ లెవల్ ఏజెంట్లను రాజకీయ పార్టీల వారు నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి వెంకట శేషయ్య, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు.



ప్రభుత్వం ఏదైనా
నా పంథా ఇదే!

● గృహ నిర్మాణశాఖలో ఆ అధికారి తీరేవేరు ● వైసీపీ హయాంలో చక్రం తిప్పిన ఆఫీసర్
● ప్రస్తుత ప్రభుత్వంలోనూ అనేక ఆరోపణలు ● విజిలెన్స్ విచారణలో బట్టబయలు
● రాష్ట్ర అధికారుల విచారణకూ డుమ్మా ● పక్క జిల్లాకు వెళ్లినా మారని తీరు

ప్రభుత్వం మారింది.. విధానాలూ మారాయి.. కానీ ఆ అధికారి తీరు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో జిల్లాలో హౌసింగ్ శాఖను భ్రష్టు పట్టించారన్న అపవాదును మూటగట్టుకున్న సదరు అధికారి.. ఇప్పుడూ అదే పంథాలో నడుస్తుండటం ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలోనే కాదు.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఆ హౌసింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. అంతేగాక సీఎంతోపాటు ఇతర ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు అందాయి. కానీ తనకున్న పలుకుబడితో తనపై చర్యలు తీసుకోకుండా ఆ అధికారి అడ్డుకుంటూ వచ్చారన్న ఆరోపణలున్నాయి. హౌసింగ్ శాఖలోని కొందరు ఉన్నత స్థాయి అధికారులు ఈ అధికారికి అండగా ఉంటున్నారన్న ప్రచారముంది.

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఈ అధికారి అవినీతిని ఎత్తిచూపుతుండటంతో పరిస్థితులు మారాయి. గతంలో నెల్లూరులో పనిచేసిన సమయంలో ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులు, విజిలెన్స్ నివేదికల నేపథ్యంలో రాష్ట్ర హౌసింగ్ అధికారులు ఇటీవల విచారణకు నెల్లూరు వచ్చారు. పక్క జిల్లాలో పనిచేస్తున్న సదరు అధికారికి విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు పంపారు. అయితే, సదరు అధికారి రెండు రోజులపాటు విచారణకు రాకుండా డుమ్మా కొట్టారు. విచారణకు హాజరైతే నేరుగా వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుందని, అప్పుడు తనపై చర్యలు తీసుకునేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందని సదరు అధికారి భావించినట్లు హౌసింగ్ శాఖలో గుసగుసలాడుకుంటున్నారు. అయితే విచారణాధికారులు కూడా తెలివిగా వ్యవహరించి నేరుగా పక్క జిల్లాలో సదరు అధికారి పనిచేస్తున్న చోటకు వెళ్లి విచారించారు. ఈ వ్యవహారం ఇప్పుడు హౌసింగ్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అయితే తనను ఎవరూ ఏమీ చేయలేరని బహిరంగంగానే చెప్పుకుంటున్నట్లు ఆ శాఖ ఉద్యోగ వర్గాలు మాట్లాడుకుంటుండటం కొసమెరుపు.

● చర్యలకు బదులు ప్రమోషన్

వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో పనిచేసే సమయంలో సదరు హౌసింగ్ అధికారిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. సిమెంటు, స్టీలు మాయం చేయడమేగాక తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించారన్న అభియోగాలు ఉన్నాయి. ఆ సమయంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఓ గోదామును తనిఖీ చేసి రూ.1.53 కోట్ల విలువైన సిమెంటు, స్టీలు మాయమైందని, అందుకు బాధ్యుడిగా ఈ అధికారిపై కూడా చర్యలకు సిఫార్సు చేశారు. అయితే ఈ అధికారిపై విచారణలు పెండింగ్ ఉన్నప్పటికీ గతేడాది ప్రమోషన్ ఇచ్చి మరీ జిల్లా స్థాయి పోస్టులో కూర్చోబెట్టారు. ఇప్పుడు కూడా ఆ జిల్లాలో సదరు అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా జిల్లా నుంచి బదిలీ అయి వెళ్లినా గతంలో చేసిన తప్పులు బయటకు రానీయకుండా ఉండేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దసరాకు ఊరెళుతున్నారా...
దొంగలతో జాగ్రత్త!

● 'ఎల్‌హెచ్‌ఎంఎస్' ఇంటికి రక్ష

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూర్లకు, యాత్రలకు వెళుతున్నారా? అయితే మీ ఇంట్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి!. ఏటా పండుగ సంతోషంలో ప్రజలుంటే దొంగలు తాళం వేసిన ఇళ్లను దోచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచడం మంచిదని సూచిస్తున్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని పోలీసులు చెబుతున్నారు. ● స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి. ● మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది. ● ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది. ● ఊరికి వెళ్లే ముందు ఈ యాప్‌లో రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన, ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు వస్తారు అన్న వివరాలు పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆక్రమణలు తొలగేనా.. కాలువలు బాగుపడేనా!?

● రూ.47 కోట్లతో కాలువల అభివృద్ధికి టెండర్లు
● పది రోజుల్లో పూర్తి చేయనున్న ఇరిగేషన్ శాఖ
● ఆక్రమణలు తొలగించాలంటూ కమిషనర్‌కు లేఖ

6 లో..

● గర్భిణులు, బాలింతలకు లబ్ధి
● రూ.11 వేల వరకు ఆర్థిక సాయం

మళ్లీ 'మాతృ వందనం' అమలు

సంగం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకర ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)ను 2017లో ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆర్థికసాయం అందించేది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలులో నిర్లక్ష్యం చేసింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను వివిధ కార్పొరేషన్లకు మళ్లించడంతో అసలు ఈ పథకం ఉన్నట్లు దాదాపు ప్రజలు మరచిపోయారు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ మాతృ వందనం పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. గతంలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షిస్తున్న ఈ పథకాన్ని ఇప్పుడు మహిళా శిశు సంక్షేమ శాఖకు బదలాయించారు.

● తల్లుల ఖాతాల్లోకి..

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మినీ, ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 2,934 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు సుమారు 15 వేల మంది, బాలింతలు 12 వేల మంది ఉన్నారు. వీరందరికీ మాతృవందనం పథకం ద్వారా రూ. 11వేల వరకు సాయం అందిస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక లాగిన్ కేటాయించారు. అందులో లబ్ధిదారుల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అర్హులు. గర్భం దాల్చిన తరువాత రూ.1000 ఇస్తారు. ప్రసవం అనంతరం రూ. 2వేలు, ఏడాదిలో బిడ్డకు టీకాలు పూర్తయిన తరువాత మరో రూ.2వేలు నేరుగా లబ్ధిదారు ఖాతా జమవుతుంది. ఇక రెండో కాన్పులో ఆడపిల్ల జన్మిస్తే రూ. 2వేల చొప్పున మూడు విడతల్లో జమవుతుంది. రెండు కాన్పులకు కలిపి మొత్తం రూ.11వేలు అందుతుంది. ఈ పథకం వల్ల పేద గర్భిణులు పోషకాహారంతోపాటు చంటి బిడ్డలకు సకాలంలో టీకాలు వేయించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



6 లో..

మెరిసిన తారలు..
ముసిసిన నవ్వులు

నెల్లూరులో వారాహి సిల్క్స్ షోరూం గురువారం నెల్లూరులో ఘనంగా ప్రారంభమైంది. సినీ నటి మీనాక్షి చౌదరి, నటి, యాంకర్ సుమ కనకాల హాజరై అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా అందరితో కలిసి నవ్వులు పూయించారు.



బాలుర మృతదేహాలను చూసి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉయ్యాలపల్లిలో బుధవారం అదృశ్యమైన ఇద్దరు చిన్నారులు కన్నవారిలో తీవ్ర శోకాన్ని మిగిల్చారు. ఏ చెరువు వారు వారు కనిపించకుండా పోయారో... అదే చెరువులో గురువారం శవాలుగా తేలారు. బిడ్డల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



నీటి గుంతలో నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

● అదృశ్యమైన చిన్నారుల విషాదాంతం ● చెరువుకుంటలో పడి మృత్యువాత ● ఉయ్యాలపల్లిలో విషాదఛాయలు ● గుండెలవిసేలా రోదించిన బంధువులు

తీరని పుత్రశోకం

కలువాయి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన నూటేటి విష్ణువర్ధన్ (9), మనుబోటి నవశ్రావణ్ (12) దసరా సెలవులు కావడంతో బుధవారం ఇంటి వద్ద ఆడుకుంటున్నారు. కాగా గ్రామ చెరువులో నుంచి ఉయ్యాలపల్లికి టిప్పర్లతో మట్టి తోలుతున్నారు. అందులో ఓ టిప్పరుకు నవశ్రావణ్ తండ్రి నరసింహులు డ్రైవర్‌గా ఉన్నాడు. ఆడుకుంటున్న నవశ్రావణ్, విష్ణువర్ధన్‌ను నరసింహులు తన టిప్పరులో ఎక్కించుకుని చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వారిని దించి, ఇంటికి వెళ్లండని చెప్పగా, వారు బయలుదేరారు. అయితే సాయంత్రానికి కూడా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు సమీపంలోని కాలువలు, అటవీ ప్రాంతంలో రాత్రి పొద్దుపోయే వరకు గాలించారు. ఎలాంటి ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా గురువారం ఉదయం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సంగం సీఐ వేమారెడ్డి, చేజర్ల, రాపూరు, సైదాపురం, మర్రిపాడు ఎస్ఐలు తిరుమలరావు, రాజేష్, క్రాంతికుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు డ్రోన్ కెమెరాలు, జాగిలాల సాయంతో ఉయ్యాలపల్లి పరిసరాలను మధ్యాహ్నం వరకు జల్లెడ పట్టారు. మధ్యాహ్న సమయంలో గొర్రెల మంద ఒకటి చెరువులోని గుంటలో నీళ్లు తాగేందుకు వెళ్లి బెదిరిపోయాయి. ఇది గమనించిన గొర్రెల కాపరి గుంటవద్దకు వెళ్లి చూడగా, అందులో ఓ బాలుడి శవం తేలుతూ కనిపించింది. ఈ విషయాన్ని ఆ గొర్రెలకాపరి పోలీసులకు, గ్రామస్థులకు తెలియచేశాడు. దీంతో పోలీసులు గుంట వద్దకు వచ్చి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బుధవారం ఉదయం ఆడుతూపాడుతూ కనిపించిన బాలురు గురువారం విగతజీవులుగా మారడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు.

● చివరిచూపు కోసం గల్ఫ్ నుంచి...

నూటేటి ప్రసాద్-లక్ష్మమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. వీరిలో విష్ణువర్ధన్ చివరివాడు. కలువాయిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ప్రసాద్ బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. బుధవారం కుమారుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన గల్ఫ్ నుంచి బయలు దేరి గురువారం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి చేరుకునేలోపు కుమారుడు ఇక లేడన్న వార్త తెలుసుకుని కన్నీరుమున్నీరయ్యాడు.

● నేనే చంపుకున్నా..

మనుబోటి నరసింహులు- సుశీల దంపతులకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు నవశ్రావణ్. ఉయ్యాలపల్లిలోనే ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. నరసింహులు ఇంటి వద్దే వ్యవసాయం చేసుకుంటూ, పనులు లేనప్పుడు టిప్పరు డ్రైవరుగా వెళుతుంటారు. నవశ్రావణ్ మృతదేహాన్ని చూస్తూ తానే చెరువు వద్దకు కుమారుడిని తీసుకెళ్లానని, ఇలా జరుగుతుందని ఊహించలేదని నరసింహులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232
కోడిగుడ్ల ధర (100): 550	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,880
వెండి కిలో ధర	రూ. 1,41,200
వెండి ఒక గ్రాము	రూ.144.00

వెలగని వీధి దీపాలు : పట్టించుకోని అధికారులు

కావలి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఇందిరమ్మకాలనీ లో వీధి దీపాలు వెలగక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఆరువేల కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఎక్కడ చూసినా వెలగని వీధి దీపాలే దర్శనమిస్తున్నాయి. వీధి లైట్లు వెలగక పోవటంతో రాత్రిపూట విషసర్పాల సంచారంతో ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి వీధి దీపాలకు గుర్తించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

జాతికి జీవం జానపదం!

కందుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని ప్రతీ జాతికి తనదైన ఒక సంస్కృతి ఉంటుందని, జానపదమే జాతికి జీవమని టీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మహిళా సాధికారత విభాగం, సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగ కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూ ఒకప్పుడు దసరా, శ్రీరామనవమి పండుగల సందర్భంగా కోలాటం, పగటి వేషాలు, తప్పెటగుళ్ల వంటి జానపద కళారూపాలను విశేషంగా ప్రదర్శించేవాళ్లని గుర్తు చేశారు. విద్యార్థినుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు, ఐక్యూ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పీ రాజగోపాలబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ అనూష, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

అల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎడగారు పూర్తిచేసుకున్న క్రమంలో రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకునే సమయం కావడంతో జీలుగ విత్తనాలను సిద్ధంగా ఉంచామని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలలో తెలిపారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద ఈ విత్తనాలను సిద్ధంగా ఉంచామని, 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఈ విత్తనాలను తీసుకొని పచ్చిరొట్ట పైరులను వేసుకోవాలని ఆయన సూచించారు.

శ్రమదానం చేద్దాం పరిసరాలను శుభ్రపరుచుకుందాం !

అల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఒక్కరూ శ్రమదానం చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని గురువారం అల్లూరులోని ఆర్‌డిఆర్ కాలనీలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లు శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీడీవో వరప్రసాద్, స్థానిక నాయకులు షేక్ నజీర్ బాషా, పాశం దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

విట్స్‌లో ..

కావలి (టౌన్),(ఆంధ్రజ్యోతి):విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు.

కనుల పండువగా నవరాత్రోత్సవాలు


బిట్రగుంట : కాత్యాయనిదేవి అవతారంలో దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి


కావలిటౌన్ : కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి


కలిగిరి : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కొండాపురం : అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

కావలి (టౌన్) సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రోత్సవాలు నాల్గవ రోజు గురువారం కనుల పండువగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు మహాగౌరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చి రాత్రి చిలుక వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు భువనేశ్వరీదేవి అలంకారంలో కొత్తబజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు కాత్యాయినీ దేవి అలకారంలో దర్శనమివ్వగా ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విష్ణాలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు కాత్యాయినీ దేవి అలకారంలో దర్శనమిచ్చారు.

● బృందావనం కాలనీలో వున్న శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారికి చిన్నశేష, హంస వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీవారికి చిన్నశేష వాహన సేవ, రాత్రి హంస వాహన సేవలందించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామివారికి ఉదయం సింహ వాహన ఉత్సవం, రాత్రి ముత్యపు వాహన ఉత్సవం జరగనున్నాయి.

బిట్రగుంట : బోగోలు మండల ఆలయాలలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబల్లి శ్రీనివాసులు విజయలక్ష్మీ, సాధు శ్రీనివాసులు, దుర్గావతి దంపతులు పాల్గొన్నారు. బోగోలు షిర్డిసాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాలలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించారు.

కలిగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు గురువారం భక్తులకు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చనలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద పూజా కార్యక్రమంలో ఉంచిన నోటుపుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంచిపెట్టారు. గోనె వెంకటకృష్ణయ్య-ఆదెమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలోని గంగమ్మ గుడివద్ద దేవీ నవరాత్రులను పురస్కరించుకొని అమ్మవారికి గురువారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించి కుంకుమపూజ తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందచేశారు.

కందుకూరు : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంకమ్మతల్లి కాత్యాయనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతం అభిషేకం, కుంకుమ పూజ అష్టోత్తరం, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

కావలి (టౌన్) సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ 2వ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వెంగళరావునగర్ పీహెచ్‌సీ ఆవరణలో పార్టీ అధ్యక్షుడు లక్కరాజు భాస్కర్ అధ్యక్షతన దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బీజేపీ నేతలు మురళి, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం, సన్నిగంటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

●ఒకటవ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంద కిరణ్ అధ్యక్షతన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరత్, బెల్లంకొండ మాల్యాద్రి, బ్రహ్మానందం, కమల, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●రూరల్ కమిటీ ఆధ్వర్యంలో

పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా కావలి రూరల్‌మండల బీజేపీ అధ్యక్షుడు జరుగుమల్లి జయకుమార్ ఆధ్వర్యంలో కావలి ఏరియావైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కంచర్ల మురళీ, ఎం. అనిత, బీ. మాల్యాద్రి, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం, వీ. జయరామిరెడ్డి, పీ. క్రాంతికుమార్, ఏ. మురళీ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండల బీజేపీ అధ్యక్షుడు వీరాల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎన్. శ్రీనివాసులు యాదవ్, జీ వెంకటేశ్వర్లు, పీ.గోవిందరాజులు, పీ.సూర్యం, డీ.మాల్యాద్రి, ఎన్.జ్యోతి, ఎస్.యామిని పాల్గొన్నారు.

కొండాపురం : పండిట్ దీన్‌దయాళ్ జయంతిని కొండాపురం పీహెచ్‌సీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో బీజేపీ నేతలు ఓరుగంటి మాధవ్, మాలేపాటి మల్లికార్జున, చల్లా చినమాల కొండయ్య, సోమినేని రవీంద్ర, కొమ్మి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు స్థలాన్ని కబ్జా చేయటం దుర్మార్గం

● ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు


తహసీల్దారుతో చర్చిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జర్నలిస్టులు

కందుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డులో 1999లో జర్నలిస్టులకు ఇచ్చిన నివాస స్థలాలలో ఆంధ్రజ్యోతి విలేకరి కె. హరిబాబుకు చెందిన స్థలాన్ని దుర్గమ్మగుడి కమిటీ పేరిట కబ్జా చేయటం దుర్మార్గ చర్య' అని, అధికారులు వెంటనే కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం కబ్జాకు గురైన స్థలాన్ని ఐవీ సుబ్బారావు ఇతర జర్నలిస్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరి నిర్మించుకున్న ప్రహరీగోడను కూడా ధ్వంసం చేసి ఆనవాలు లేకుండా చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ముందస్తు వ్యూహంతో కబ్జా చేసిన వారు దేవాలయ కమిటీ పేరిట పలువురు మహిళలకు పూనకం వచ్చినట్లుగా హడావిడి చేశారు. స్థానికులు మాట్లాడుతూ దురాక్రమణ తప్పేనని, సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తే బాగుంటుందని ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులతో అన్నారు. అయితే దేవుడి పేరిట స్థలం దురాక్రమణ మంచి పద్ధతి కాదని సుబ్బారావు ఖండించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధుల బృందం కబ్జా విషయాన్ని కందుకూరు సీఐ అన్వర్‌బాషా, తహసీల్దారు లావణ్యల దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ పరిస్థితులను విచారించి బాధిత విలేకరికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టాలు అధికారికంగా దాఖలు చేసినవని గుర్తించామని, కబ్జాదారులపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులతో పాటు కందుకూరులోని జర్నలిస్టులంతా ఈ ఘటనను ముక్తంకంఠంతో ఖండిస్తూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఏ సురేష్, దాసరి కనకయ్య, వెంకటరావు, రాంబాబు, స్థానిక జర్నలిస్టులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మ ఆశయాలు కొనసాగిద్దాం


మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

కావలి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఆశయాలు కొనసాగిద్దాం.. అని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మాగుంట పార్వతమ్మ ప్రథమ వర్థంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట కుటుంబం ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆమె కావలి నియోజకవర్గానికి అందించిన సేవలు, అభివృద్ధిని గుర్తించి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జీ. కిషోర్, జ్యోతిబాబూరావు, జీ. రాజకుమార్‌చౌదరి, జే. మహేంద్ర యాదవ్, అయేషా కే. భాస్కరరెడ్డి, దావులూరి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ వద్దంటూ నిరసన

కావలి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామమూర్తిపేటలో సత్యనారాయణగుడి సమీపంలో ఏర్పాటు చేస్తున్న బార్‌అండ్‌రెస్టారెంట్‌కు వ్యతిరేకంగా కావలిపట్టణంలో ఉమన్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతవాసులు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం, బ్యాంకులు, విద్యాసంస్థల చుట్టూ నివాసాలు ఉండే ఈ ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే ప్రశాంతతకు విఘాతం కలుగుతుందని అధికారులకు పలు పర్యాయాలు విన్నవించినా రెస్టారెంట్ నిర్మాణం ఆగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళ రెడ్డి, నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, శివ పార్వతి, అందే రామయ్య, పెసల కృష్ణ, సింగవరపు సురేంద్రరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి : జేవీవీ

ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని గురువారం జేవీవీ నాయకులు ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే పేదలు, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్య గగనంగా మారతుందన్నారు. అనంతరం ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మల్లికార్జున, సందాని, సాదిక్ హుస్సేన్, ముజీబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సభ్యత్వ నమోదు

వింజమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏపీ ఎన్జీవో వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు సభ్యత్వ నమోదుచేశారు. తొలుత ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డికి సభ్యత్వాన్ని నమోదు చేశారు. నవంబర్‌లో జరిగే ఏపీ ఎన్జీవో ఎన్నికల కోసం సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వింజమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

నేత్రానందంగా కాత్యాయనిదేవి అలంకారం

ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తజనం


ఉదయగిరి : కాత్యాయనిదేవి అలంకరణలో పార్వతీదేవి


వరికుంటపాడు : కాత్యాయనిదేవి అలంకరణలో నాగరప్పమ్మ


సీతారామపురం : కాత్యాయనిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


తూర్పురొంపిదొడ్ల : కుష్మాండ దుర్గాదేవి అలంకరణలో మానసాదేవి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాత్యాయనిదేవి అలంకరణలో అమ్మవారు కనువిందు చేశారు. వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు కాత్యాయనిదేవి అలంకరణలో, తూర్పురొంపిదొడ్లలో మానసాదేవి అమ్మవారు కుష్మాండ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●ఉదయగిరి: పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీ నగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు కాత్యాయినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

●సంగం : స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో గురువారం రాత్రి కాత్యాయనిదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

●సీతారామపురం: మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం, గ్రామ దేవత అంకాలమ్మ గుడి, నారాయణమ్మపేటలో విజయకనకదుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు శ్రీకాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు గురువారం దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, సహస్ర దీపాకాలంకరణ, అర్చన అభిషేకాలు నిర్వహించారు. అంకాలమ్మగుడి వద్ద ఓంకారం నాగేశ్వరరావు,సుజాత దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


ఉదయగిరి: రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఉదయగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ శిబిరంలో అధికారులు, బీజేపీ కార్యకర్తలు, యువత అధికసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు వీ విజయలక్ష్మీ, సొసైటీ అధ్యక్షుడు చుండి హరిగోపాల్ రెడ్డి, తహసీల్దారు ఎల్ రామ్మోహన్, వైద్యాధికారి శివకల్పన, పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ, బీజేపీ నాయకులు నారాయణ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సురేష్, శ్రీహరి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలో బీజేపి మండల అధ్యక్షుడు గుండాల విజయబాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీజేపి అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు భరత్‌రెడ్డి, శివారెడ్డి, జగ్గారెడ్డి, కోటేశ్వరరెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి


ఉదయగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజరు నజీర్

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గండిపాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు షేక్ నజీర్ అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తమవంతు బాధ్యతగా చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని శుభ్రతకు శ్రీకారం చుట్టాలని కోరారు. అనంతరం పలు దుకాణాలు, వీధుల్లో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని శుభ్రంచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు పీ నవ్య, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ సుధీర్, క్యాషియర్ సందానీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : సీడీపీవో


ఆత్మకూరు: రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో గోడపత్రికలను ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలని ఆత్మకూరు సీడీపీవో పి సునీలత సూచించారు. గురువారం మండలంలోని వాశిలిలో సర్పంచ్ చెలిక రమాదేవి ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా అధిక పోషకాలు ఉండే కూరగాయాలు, ఆకుకూరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: స్థానిక రైతుభరోసా కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రుగ్మతలతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పుణ్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, వైద్యఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●సంగం: స్థానిక సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ అశోక్ ప్రారంభించి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీయస్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే పిండి వంటలను ప్రదర్శించారు.

●ఏఎస్ పేట: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని టీడీపీ నాయకుడు మాల్యాద్రి నాయుడు సూచించారు. గురువారం ఆయన కావలి ఎడవల్లి గ్రామంలో చిరమన పీహెచ్‌సీ వైద్యులు డా జ్యోతిరాణి, నాగవినూత్న ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పలు వ్యాధులకు సంబంధించి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ కె సుబ్బలక్ష్మి, హెచ్‌ఈవో షఫీ, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్‌ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

●వింజమూరు: సచివాలయం-5 పరిధిలో గురువారం వైద్య, ఆరోగ్య సిబ్బంది స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలతో వైద్య ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్యాధికారి మురళీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలకు వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం, వైద్య శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ సక్కు బాయి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, లీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సునీత, జానకి, ఉష, విజయలక్ష్మీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, ఎఫ్‌డీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

వింజమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య ఈసీ సమావేశం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏపీఎం సుధాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే అధిక రుణాలు ఇచ్చేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు సునీత, సుశీల, లక్ష్మీకుమారి, విజయమ్మ, ఎఫ్‌బీటీపీ ఆదిలక్ష్మీ, అకౌంటెంట్ సువార్తమ్మ, సంఘబంధ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.